


# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028


ముస్లీం విద్యార్థులకు నగదు

## చెక్కులు పంపిణీ.




Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 217 పేజీలు - 08 వెల - 05/- సోమవారం 03-08-2026


# ఏపీ, ఆస్ట్రేలియా మధ్య 4 కీలక ఒప్పందాలు



- ఐఐటీ తిరుపతిలో సోలార్ తయారీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు
- విద్యార్థుల మానసిక ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- మంత్రి లోకేష్ ఆస్ట్రేలియా పర్యటన ఫలితంగా కుదిరిన ఎంవోయూలు
- లోకేష్, ఆస్ట్రేలియా మంత్రి జూలియన్ హిల్ సమక్షంలో సంతకాలు



ఆంధ్రప్రదేశ్, ఆస్ట్రేలియా మధ్య బంధం మరింత బలపడింది. క్లీన్ ఎనర్జీ, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక రంగాల్లో సహకారాన్ని పెంచుకుంటూ ఇరుపక్షాలు నాలుగు వ్యూహాత్మక ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకున్నాయి. ఉండవల్లిలో శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్, ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్య, అభివృద్ధి సహాయ మంత్రి జూలియన్ హిల్ హాజరయ్యారు. ఇటీవల మంత్రి నారా లోకేశ్ ఆస్ట్రేలియాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ పర్యటన సందర్భంగా అక్కడి సంస్థలతో జరిపిన చర్చలు, ఏపీలో పెట్టుబడులకు ఇచ్చిన ఆహ్వానం ఫలితంగానే ఈ ఒప్పందాలు సాకారమయ్యాయి.

**1. ఐఐటీ తిరుపతిలో సోలార్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్**

మొదటి ఒప్పందం ప్రకారం, విశాఖలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ (జశీజుజు), ఐఐటీ తిరుపతి, ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ (ఖచీూఔ) కలిసి ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో 'సోలార్ తయారీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేయనున్నాయి. దీని ద్వారా ఏపీని సోలార్ తయారీ, పరిశోధన, ఆవిష్కరణలకు జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దడం లక్ష్యం. ఈ సెంటర్‌లో అధునాతన సోలార్ పీవీ తయారీ, ప్యానెళ్ల రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ వంటి అంశాలపై పరిశోధనలు జరుగుతాయి.

మిగతా 2లో

# ఘనంగా ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి
- కుటుంబ సమేతంగా తొలి బంగారు బోనం సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్ ● భారీగా తరలివచ్చిన భక్తజనం.. ముమ్మర ఏర్పాట్లు చేసిన యంత్రాంగం ● దర్శించుకున్న పలువురు మంత్రులు, రాజకీయ ప్రముఖులు ● జాతరలో ఏర్పాట్లపై జోగినుల ఆవేదన నేటి భవిష్యవాణికి ఏర్పాట్లు పూర్తి



బేగంపేట :-సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారికి

మిగతాది 2లో

# ప్రజలు ఎన్నుకున్న విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా?: జగన్

● రాష్ట్రంలో అరాచక పాలన పరాకాష్టకు చేరిందని జగన్ విమర్శ ● ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని ఉగ్రవాదిలా అరెస్ట్ చేశారని ఆగ్రహం ● సీదిరి అప్పలరాజు, ముస్తఫాలపై అక్రమ కేసులు బనాయించారని ధ్వజం ● ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చడానికే దాడులు, అరెస్టులని విమర్శ



2

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, 'నారాసుర పాలన'లో అరాచకం పరాకాష్ఠకు చేరిందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దాడి చేసిన అధికార పార్టీ వారికి రక్షణ కల్పిస్తూ, బాధితులైన ప్రతిపక్ష నేతలపైనే హత్యాయత్నం వంటి తీవ్రమైన కేసులు బనాయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యమా, పోలీస్ రాజ్యమా లేక జంగిల్ రాజ్యమా అని ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు.ఆలూరు బీసీ ఎమ్మెల్యే విరూపాక్షిని అర్ధరాత్రి అరెస్ట్ చేసిన తీరుపై జగన్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. "ప్రజలెన్నుకున్న ఎమ్మెల్యే విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా? అర్ధరాత్రి 2:45 గంటలకు వందలాది పోలీసులతో ఇంటిపై దాడి చేసి, తలుపులు బద్దలుకొట్టి అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చింది?" అని జగన్ నిలదీశారు. చిప్పగిరి మండలం నేమకల్లులో టీడీపీ శ్రేణులు తమ పార్టీ నాయకుడి ఇంటిపై దాడి చేయగా, ప్రాణభయంతో ఆ కార్యకర్త ఎమ్మెల్యేకు ఫోన్ చేశాడని జగన్ వివరించారు. బాధితుడికి అండగా నిలబడటానికి వెళ్లిన ఎమ్మెల్యేపైనే టీడీపీ వారు రాళ్లతో దాడి చేశారని, ఈ ఘటనలో ఆయన సోదరుడు గాయపడ్డాడని తెలిపారు.

# ఏపీలో తక్కువ ధరకే బియ్యం.. అమ్మకాలు ప్రారంభించిన మంత్రి

సామాన్యులకు ఊరటనిస్తూ ప్రభుత్వ బియ్యం అమ్మకాలు

- విజయవాడలో కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్
- రైతు బజార్లు, మిల్లుల్లో కేజీ రూ. 50, రూ. 52కే బియ్యం
- త్వరలో కందిపప్పు, పామాయిల్ కూడా తక్కువ ధరకే



రాష్ట్రంలోని సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఊరట కల్పిస్తూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న బియ్యం ధరలను నియంత్రించేందుకు, తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 130 రైతు బజార్లు, 500 రైస్ మిల్లుల వద్ద ప్రత్యేక కౌంటర్ల ద్వారా సబ్సిడీ బియ్యం విక్రయాలను ఆదివారం ప్రారంభించింది. విజయవాడలోని ఏపీఐఐసీ రైతు బజార్‌లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

మిగతాది 2లో

# బోనాలను గతంలో పట్టించుకోలేదు..

● సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న కేటీఆర్ ● గత ప్రభుత్వాలు బోనాలను గుర్తించలేదని విమర్శ ● కేసీఆర్ పాలనలోనే బోనాలకు రాష్ట్ర పండుగ హోదా వచ్చిందన్న మాజీ మంత్రి ● వర్షాలు బాగా పడి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు వెల్లడి



2

# హైడ్రాకు వెల్లువెత్తిన ప్రజా మద్దతు.. కొనసాగించాలంటూ హైదరాబాదులో ర్యాలీలు

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కొనసాగించాలని విజ్ఞప్తి



● హైడ్రాకు సంఘీభావం తెలుపుతూ నగరంలో పలు సంక్షేమ సంఘాల ర్యాలీల ● వరద కట్టడి, చెరువుల పరిరక్షణ చర్యలను స్వాగతించిన నగరవాసులు ● రెండేళ్లలో రూ. 1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూమిని కాపాడిందని ప్రశంసలు ● సోషల్ మీడియా దుష్ప్రచారాన్ని ఖండిస్తూ..

హైదరాబాద్ నగరంలో వరద నివారణ, చెరువుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'హైడ్రా'కు ప్రజా మద్దతు వెల్లువెత్తింది. ప్రభుత్వ నిర్ణయానికి మద్దతుగా, హైడ్రా పనితీరును ప్రశంసిస్తూ నగరంలోని పలు కాలనీల సంక్షేమ సంఘాలు ఆదివారం భారీ ర్యాలీలు నిర్వహించాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేస్తూ, హైడ్రా కమిషనర్‌కు సంఘీభావం ప్రకటించాయి.

మిగతా 2లో

# సాయికృష్ణ లాకప్ డెత్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం

- సీఐ నాగరాజు స్నేహితుడు సురేశ్ పరారీలో ఉన్నట్లు ప్రకటన
- సీఐ నాగరాజుకు సురేశ్ సహకరించినట్లు గుర్తింపు
- సురేశ్ ను పట్టుకుంటేనే మిస్సింగ్ లింకులు దొరుకుతాయన్న సిట్
- సురేశ్ పరారీ విషయాన్ని హైకోర్టుకు నివేదించిన దర్యాప్తు బృందం
- ఈ కేసులో ఇప్పటికే ఐదుగురిని అరెస్ట్ చేసిన అధికారులు

విజయవాడలో సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ లాకప్ డెత్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సీఐ నాగరాజు స్నేహితుడు సురేశ్ పరారీలో ఉన్నట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) వెల్లడించింది. ఈ వ్యవహారంలో నాగరాజుకు సురేశ్ సహకరించినట్టు గుర్తించార.



2

# రాజకీయాల్లోకి 'కాక్రోచ్ జనతా పార్టీ'? ఆగస్టు 5న కీలక నిర్ణయం



2

● రాజకీయ ప్రవేశంపై నిర్ణయం తీసుకోనున్న కాక్రోచ్ జనతా పార్టీ ● ఆగస్టు 5న అభిజీత్ దీప్కే నివాసంలో కీలక కోర్ కమిటీ సమావేశం ● నీట్ పేపర్ లీక్ నిరసనల విజయంతో ఉద్యమ సంస్థపై పెరిగిన అంచనాలు ● ఉద్యమంగానే కొనసాగాలా లేక పార్టీ పెట్టాలా అనే దానిపై

# ఏపీ, ఆస్ట్రేలియా మధ్య 4 కీలక ఒప్పందాలు

ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేయనున్నాయి. దీని ద్వారా ఏపీని సోలార్ తయారీ, పరిశోధన, ఆవిష్కరణలకు జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దడం లక్ష్యం. ఈ సెంటర్‌లో అధునాతన సోలార్ పీవీ తయారీ, ప్యానెల్ల రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ వంటి అంశాలపై పరిశోధనలు జరుగుతాయి. సోలార్ సెల్ ఫిజిక్స్, మాన్యుఫ్యాక్చరింగ్, వాఫరింగ్ టెక్నాలజీస్ వంటి అంశాలపై కరిక్యులమ్, శిక్షణా కార్యక్రమాలను ఖచీంఔ రూపొందించి సహకారం అందిస్తుంది.

2. సమ్మిళిత విద్య బలోపేతం కోసం

రెండో ఒప్పందం సమ్మిళిత విద్యపై దృష్టి సారించింది. యూఎన్ఎస్‌డబ్ల్యూ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఏపీ సమగ్ర శిక్ష సంయుక్తంగా ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఆటిజం, ఇతర న్యూరోడైవర్స్ విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంచడం దీని ముఖ్య ఉద్దేశం. స్పెషల్ ఎడ్యుకేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు, రాష్ట్ర విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా బోధనా వనరులను రూపొందిస్తారు.

3. విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై పైలట్ ప్రాజెక్ట్

మూడో ఒప్పందంలో భాగంగా ఏపీ ఉన్నత విద్యా మండలి, ఆస్ట్రేలియాకు చెందిన రీబౌండ్ డింపుల్ ప్రైవేట్ లిమిటెడ్ కలిసి రాష్ట్రంలోని ఎంపిక చేసిన విద్యాసంస్థల్లో పైలట్ ప్రాజెక్టు చేపట్టనున్నాయి. విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిరక్షణే దీని లక్ష్యం. ప్రత్యేకంగా రూపొందించిన వేదిక ద్వారా విద్యార్థులు తమ గోప్యతకు భంగం కలగకుండా మానసిక ఆరోగ్య సలహాలు, వర్చువల్ కౌన్సెలింగ్ సేవలను పొందవచ్చు. ఈ పైలట్ ప్రాజెక్టును ఉచితంగా అమలు చేయనున్నారు.

4. నైపుణ్యాభివృద్ధికి డీఎల్ఎస్‌తో భాగస్వామ్యం

నాలుగో ఒప్పందం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఒూూూణజ), ఆస్ట్రేలియాకు చెందిన డైనమిక్ లెర్నింగ్ సర్వీసెస్ (ఖూూ) మధ్య కుదిరింది. వృత్తి విద్య, నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం కోసం ఇరు సంస్థలు కలిసి పనిచేస్తాయి. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా శిక్షణా కార్యక్రమాలను రూపొందించి, ప్రొఫెషనల్ సర్టిఫికేషన్ అందించడం దీని ప్రధాన లక్ష్యం. ఈ ఒప్పందాలకు ముందు ఆస్ట్రేలియా ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయింది. ఏపీలో ఉన్న అవకాశాలను సీఎం వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, ఐఐటీ తిరుపతి డైరెక్టర్ డా.సత్యనారాయణ్, చెన్నైలోని ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ సిలై జాకీ సహా పలువురు ఉన్నతాధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# సాయికృష్ణ లాకప్ డెత్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం

ఉన్నట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) వెల్లడించింది. ఈ వ్యవహారంలో నాగరాజుకు సురేశ్ సహకరించినట్లు గుర్తించారు. ఈ కేసుకు సంబంధించిన కొన్ని కీలక అంశాలు, మిస్సింగ్ లింకులపై సురేశ్ వద్ద ముఖ్యమైన సమాచారం ఉందని, అతడిని పట్టుకుంటేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని సిట్ అధికారులు భావిస్తున్నారు.

వివరాల్లోకి వెళితే, కేసు నమోదు కాకముందు సురేశ్ ఒకసారి సిట్ విచారణకు హాజరయ్యాడు. అయితే, కేసు నమోదు చేసిన తర్వాత నుంచి అతను కనిపించకుండా పోయాడు. ఈ కేసులో ఒక దశలో రాజీ కుదిర్చేందుకు కూడా సురేశ్ ప్రయత్నించినట్లు సిట్ దృష్టికి వచ్చింది. ప్రస్తుతం సురేశ్ పరారీలో ఉన్న విషయాన్ని సిట్ అధికారులు హైకోర్టుకు నివేదించారు. అతని కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

కేసు నేపథ్యం

విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్ గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కు గురైనట్లు ఆరోపణలు రావడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఇప్పటివరకు అతడి మృతదేహం కూడా దొరకలేదు. ఈ ఘటనలో సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారనే ఆరోపణలపై నాటి సీఐ నాగరాజును అధికారులు అరెస్ట్ చేశారు. కేసు తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం దర్యాప్తును సిట్‌కు అప్పగించింది. ఇది కచ్చితంగా లాకప్ డెత్ అని సిట్ నిర్ధారించింది. ఈ కేసులో ఇప్పటివరకు ఐదుగురిని అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడైన నాగరాజు ప్రస్తుతం రిమాండ్‌పై జైలులో ఉన్నారు. సిట్ దర్యాప్తును ముమ్మరం చేసి, పలు కీలక ఆధారాలను ఇప్పటికే హైకోర్టుకు సమర్పించింది. ఈ క్రమంలోనే తాజాగా పరారీలో ఉన్న సురేశ్ పాత్రపై దృష్టి సారించింది. అతని అరెస్ట్‌తో ఈ కేసు దర్యాప్తు మరింత వేగవంతం కానుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# ప్రజలు ఎన్నుకున్న విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా?: జగన్

వారు రాళ్లతో దాడి చేశారని, ఈ ఘటనలో ఆయన సోదరుడు గాయపడ్డాడని తెలిపారు. వాస్తవానికి దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాల్సింది పోయి, బాధితుడైన ఎమ్మెల్యేపైనే హత్యాయత్నం



కేసు నమోదు చేయడం దారుణమని అన్నారు. అర్ధరాత్రి పోలీసులు జరిపిన దౌర్జన్యం బయటకు రాకూడదనే భయంతోనే ఎమ్మెల్యే ఇంట్లోని సీసీటీవీ హార్డ్‌డిస్క్‌లను తీసుకెళ్లారని, సాక్ష్యాలను కాపాడాల్సిన పోలీసులతోనే సాక్ష్యాలను మాయం చేయిస్తున్నారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు.

ఇదే తరహా రాజకీయ కక్ష సాధింపు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతోందని జగన్ విమర్శించారు. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదాన్ని హత్య కేసుగా మార్చి మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే షేక్ మహ్మద్ ముస్తఫా, ఆయన కుమారుడిపై కూడా వ్యాపార వివాదాన్ని అడ్డుపెట్టుకుని కిడ్నాప్ కేసు బనాయించారని, పోలీసులకు అప్పగించిన వ్యక్తిని కిడ్నాప్ చేశారని కేసు పెట్టడం ఎక్కడి న్యాయమని ప్రశ్నించారు.

ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ అక్రమ అరెస్టులు, దాడులకు పాల్పడుతున్నారని జగన్ అన్నారు. డీఎస్సీ–2025 అక్రమాలపై సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదని, విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఎందుకు రాజీనామా చేయడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.9,500 కోట్ల విద్యా, వసతి దీవెన బకాయిలు, నిరుద్యోగులకు ఇస్తామన్న రూ.3 వేల భృతి హామీ ఏమైందని నిలదీశారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ప్రభుత్వం దౌర్జన్యాలకు పాల్పడుతోందన్నారు. "అధికారం, పోలీసు బలం శాశ్వతం కాదు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని అర్ధరాత్రి అరెస్టులు చేసినా వైసీపీ వెనక్కి తగ్గదు. బాధితులకు అండగా నిలుస్తూ అరాచక పాలనపై పోరాటం కొనసాగిస్తాం" అని జగన్ స్పష్టం చేశారు.

# ఘనంగా ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర

అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు



చెల్లించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అనసూయ (సీతక్క) అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు. అంతకుముందు స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు, ఈవో గుత్తా మనోహర్ రెడ్డి ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. ?ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో సీఎంకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అర్చకులు సీఎం రేవంత్ రెడ్డికి తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం పలికారు. ? తొలి బంగారు బోనం సమర్పించిన మంత్రి పొన్నం

అంతకుముందు ఉదయం 4.05 గంటలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారికి తొలి బంగారు బోనంతో పాటు ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

### ఆలయానికి ప్రముఖుల తాకిడి

బోనాల జాతర సందర్భంగా ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ ఈటల రాజేందర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, ప్రభుత్వ ు ల ప ె దా ం ు వి.హనుమంతరావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీష్ రెడ్డి, మల్లారెడ్డి, కాలేరు వెంకటేష్, మర్రి రాజశేఖర్ రెడ్డి, శ్రీ గణేష్, నవీన్ యాదవ్, సాంస్కృతిక సారథి చైర్మెన్ వెన్నెల, సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దీపక్ జాన్, సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ, సీపీ సజ్జనార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తదితరులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అమెరికా కాన్సుల్ జనరల్ లారా ఈ.విలియమ్స్, హీరోయిన్ వైష్ణవి అమ్మవారికి బోనం సమర్పించి.. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### అధికారుల నిరంతర పర్యవేక్షణ

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికార యంత్రాంగం సకల ఏర్పాట్లు చేసింది. దేవాలయ చైర్మెన్ రామేశ్వర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, ఈవో మనోహర్ రెడ్డితో పాటు జీహెచ్ఎంసీ, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ, మెడికల్, ఫైర్, విద్యుత్, పోలీస్ శాఖల అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఆలయ పరిసరాల్లో ఉచిత వైద్య శిబిరాలు, మంచినీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్య సిబ్బంది నిరంతరం ఆలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకున్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎ లాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఫైర్ ఇంజన్లు, అంబులెన్సులను సిద్ధంగా ఉంచారు.??

### బోనాల్లో అపశృతి.. జోగినుల కన్నీటి ఆవేదన!

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతరలో ఏర్పాట్ల లోపం, రద్దీ నియంత్రణ రాహిత్యంపై జోగినులు, శివసత్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించేందుకు వచ్చిన తమకు ఆలయ యంత్రాంగం, పోలీసుల నుంచి సరైన సహకారం అందలేదని జోగిని శ్యామలతో పాటు పలువురు జోగినులు కన్నీటిపర్యంత మయ్యారు. తరతరాలుగా సంప్రదాయబద్ధంగా అమ్మవా రికి బోనాలు సమర్పిస్తూ సేవలు అందిస్తున్న తమకు ఆలయం వద్ద కనీస గౌరవం, ప్రాధాన్యత ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రద్దీ ఎక్కువగా ఉండటం, తోపులాట జరగడంతో ఎంతో నిష్టతో నెత్తిన ఎత్తుకొచ్చిన బోనాలు కిందపడే పరిస్థితి వచ్చిందని తెలిపారు. అధికారులు కేవలం వీఐపీలకే ప్రాధాన్యత ఇస్తూ, భక్తితో వచ్చిన జోగినులను, భక్తులను తీవ్ర ఇబ్బం దులకు గురిచేశారని, ఇకనైనా ప్రభుత్వం స్పందించి, రాబోయే రోజుల్లో శివసత్తులకు, జోగినులకు సముచిత స్థానం కల్పించి, దర్శనానికి ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయాలని కోరారు. సాధారణ క్యూలైన్‌లో వచ్చే భక్తులు, బోనాలతో వచ్చిన వారు సరైన సౌకర్యాలు లేవని అసహ నం వ్యక్తం చేశారు. అక్కడక్కడ పోలీసులు కొంత అత్యుత్సాహం ప్రదర్శించారు. అమ్మవారి బోనాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించనున్న భవిష్యవాణి(రంగం) కార్యక్రమానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది.

# ఏపీలో తక్కువ ధరకే బియ్యం..
## అమ్మకాలు ప్రారంభించిన మంత్రి నాదెండ్ల

విజయవాడలోని ఏపీఐఐసీ రైతు బజార్‌లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి, ప్రజలకు స్వయంగా బియ్యాన్ని అందజేశారు. ఈ పథకం కింద బీపీటీ సూపర్ ఫైన్ రకం బియ్యాన్ని కిలో రూ. 52కు, బీపీటీ రా రైస్‌ను కిలో రూ. 50కే విక్రయిస్తున్నారు. ఆధార్ కార్డు చూపించి ఒక వ్యక్తి 10 కిలోల వరకు బియ్యం కొనుగోలు చేయవచ్చు. బహిరంగ మార్కెట్‌లో రూ. 60 నుంచి రూ. 65 వరకు పలుకుతున్న ఈ రకం బియ్యాన్ని ప్రభుత్వం తక్కువ ధరకే అందుబాటులోకి తేవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. "ప్రజలకు కష్టం రాకముందే వారిని ఆదుకునే ప్రభుత్వం మాది. మార్కెట్‌లో బియ్యం ధరలను సమీక్షించి, సామాన్యుడిపై భారం పడకుండా తక్కువ ధరకే బియ్యం అందించాలని నిర్ణయించాం. మా విజ్ఞప్తికి రైస్ మిల్లర్లు సానుకూలంగా స్పందించి సహకరించడం అభినందనీయం" అని తెలిపారు. భవిష్యత్తులో కందిపప్పు, పామాయిల్‌ను కూడా తక్కువ ధరలకు అందించేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నామని ఆయన వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన రావు, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ నూపుర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, జనసేన నేత అమ్మిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రాకు వెల్లువెత్తిన ప్రజా మద్దతు..
## కొనసాగించాలంటూ హైదరాబాదులో ర్యాలీలు

అమీర్‌పేట, మధురానగర్, శ్రీనివాసనగర్ పరిసర ప్రాంతాల్లో శ్రీనివాస నగర్ వెస్ట్, వెంగల్ రావు నగర్, మధుర నగర్ సహా పదుల సంఖ్యలో కాలనీ సంక్షేమ సంఘాలు ఈ ర్యాలీలలో పాల్గొన్నాయి. హైడ్రాపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ, ప్రభుత్వానికి తమ మద్దతును వీడియోల రూపంలో పంపించాయి. గత రెండేళ్లలో హైడ్రా సాధించిన విజయాలే ఈ మద్దతుకు కారణమని సంఘాల ప్రతినిధులు తెలిపారు. సుమారు 3325 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడటంతో పాటు, రూ. 1.50 లక్షల కోట్ల విలువైన ఆస్తులను పరిరక్షించిందని వారు ప్రశంసించారు. రెండు విడతల్లో 20 చెరువులను పునరుద్ధరించి ఆయా ప్రాంతాల్లో వరద ముప్పును శాశ్వతంగా తొలగించడాన్ని నగర ప్రజలు కళ్లారా చూస్తున్నారని పేర్కొన్నారు. ఒకప్పుడు 5 సెంటీమీటర్ల వర్షానికే అమీర్‌పేట, పరిసర ప్రాంతాలు నీట మునిగేవని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో హైడ్రా రంగంలోకి దిగిందని స్థానికులు గుర్తుచేశారు. జీహెచ్ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ వారం రోజుల్లోనే వరద సమస్యను పరిష్కరించిందని కొనియాడారు. కొంతమంది కబ్జాదారులు, వారికి సహకరించే నాయకులు తమ ఆటలు సాగకపోవడంతోనే సోషల్ మీడియాలో హైడ్రాపై బురద చల్లుతున్నారని వారు ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ హైడ్రాను కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలోనే ఈ కార్యక్రమాలు కొనసాగాలని నినాదాలు చేశారు. ఇటీవల, హైడ్రా కమిషనర్ గా ఏవీ రంగనాథ్ ను తొలగించాలంటూ తెలంగాణ హైకోర్టు సంచలన ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో, నేటి ప్రజా ర్యాలీలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# బోనాలను గతంలో పట్టించుకోలేదు..

నేడు సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనానంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కేటీఆర్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, బోనాలు కులాలకు అతీతంగా జరుపుకునే గొప్ప పండుగ అని కొనియాడారు. సమైక్య రాష్ట్రంలో బోనాల పండుగను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, రాష్ట్ర పండుగగా గుర్తించలేదని విమర్శించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రిగా కేసీఆర్ బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించారని గుర్తుచేశారు. అమ్మవారి ఆశీస్సులతోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని కేసీఆర్ ఎప్పుడూ చెబుతుంటారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి గుడికి రూ.25 కోట్లు కేటాయించి, పండుగలను ఘనంగా నిర్వహించామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలతో పచ్చగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు కేటీఆర్ చెప్పారు. రైతులందరూ సుఖసంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# రాజకీయాల్లోకి 'కాక్రోచ్ జనతా పార్టీ'?
## ఆగస్టు 5న కీలక నిర్ణయం

ఆన్‌లైన్ వేదికగా యువతను సమీకరించి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఇప్పుడు కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. రాజకీయాల్లోకి ప్రవేశించాలా, లేక ఉద్యమ సంస్థగానే కొనసాగాలా అనే అంశంపై ఆగస్టు 5న తుది నిర్ణయం తీసుకోనుంది. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపకుడు, జెన్–జీ ఐకాన్‌గా గుర్తింపు పొందిన అభిజీత్ దీప్కే తన నివాసంలో కోర్ కమిటీ సభ్యులతో సమావేశం కానున్నారని విశ్వసనీయ వర్గాలు ఆదివారం తెలిపాయి. వివిధ రాష్ట్రాల్లోని మద్దతుదారుల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేయనున్నారు. సమావేశం ముగిసిన తర్వాత అభిజీత్ దీప్కే మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తారని పార్టీకి చెందిన ఒక ప్రతినిధి తెలిపారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ నిర్వహించిన నిరసన విజయవంతం కావడం, దాని ఫలితంగా అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో ఈ ఉద్యమ సంస్థపై అంచనాలు భారీగా పెరిగాయి. అయితే, విద్యార్థులు, యువత సమస్యలపై స్పందించే 'రెస్పాన్స్ గ్రూప్'గానే సీజేపీని కొనసాగిస్తామని అభిజీత్ గతంలోనే స్పష్టం చేశారు. శాంతియుత, ప్రజాస్వామ్య పద్ధతులకే కట్టుబడి ఉంటామని, ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా మారబోమని, ఏ పార్టీలోనూ విలీనం కాబోమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 5న జరిగే సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలను నిలబెట్టుకోవడం, విద్యా రంగంలో మార్పులకు చోదకశక్తిగా కొనసాగడం సీజేపీ ముందున్న అసలైన సవాలు అని విశ్లేషకులు భావిస్తున్నారు. సీజేపీ ఉద్యమం వెనుక బాహ్య శక్తుల పాత్ర ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అసంతృప్తి లేనిచోట ఇలాంటి ఉద్యమాలు పుట్టవని, కేవలం ఉన్న సమస్యలను విస్తృతం చేయగలవని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సీజేపీ వేగంగా విస్తరించిన తీరు, సోషల్ మీడియాలో వారి ప్రచారం, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం వంటివి... గత రెండు దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న నిరసన ఉద్యమాల నమూనాను ప్రతిబింబిస్తున్నాయని పరిశీలకులు పేర్కొంటున్నారు.

## గాజులపల్లెలో పట్టాదారు పాస్ బుక్కుల పంపిణీ




మహానంది,పల్లె వెలుగు  మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో రైతులకు ఆదివారం పట్టాదారు పాసుపుస్తకాలను తహశీల్దార్ పి.రమాదేవి పంపిణీ చేశారు. ఈ  సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే  ప్రభుత్వ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. గ్రామంలో 948 రైతులకు పాసు పుస్తకాలు మంజూరయ్యాయన్నారు. రైతులందరూ ఈ కేవైసీ చేయించుకొని పట్టాదారు పాసుబుక్కులు తీసుకువెళ్లాలన్నారు. ఏవైనా తప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సుబ్బారావు, వీఆర్వోలు జేజి బాబు, మోహన్, గోపవరం సొసైటీ చైర్మన్ గంగవరపు ఉమామహేశ్వర్ రెడ్డి, రవి స్వామి, శశికళ కొండారెడ్డి, సర్వేర్ సద్దాం, రైతులు పాల్గొన్నారు.

## ఈ నెల 03న ప్రజా సమస్యల పరిష్కార
# వేదిక నిర్వహణ.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లా ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించి, ప్రభుత్వ సేవలను మరింత సమర్ధవంతంగా ప్రజలకు అందించాలనే లక్ష్యంతో ఈ నెల



03వ తేదీ (సోమవారం) జిల్లా వ్యాప్తంగా “ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్)” కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ఒకేసారి నిర్వహించబడుతుందని తెలిపారు. ఉదయం 10.00 గంటల నుంచి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులు వాటి పరిష్కారానికి చర్యలు చేపడతారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను నేరుగా కార్యక్రమంలో సమర్పించవచ్చని, అలాగే ఎవవనిశీయిఎ.ఖజా.గ్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదులు నమోదు చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. సమర్పించిన అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా టోల్ ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు. అర్జీదారులు తమ సమస్యలకు సంబంధించిన వినతులను ముందుగా మండల, రెవెన్యూ డివిజన్ లేదా మున్సిపల్ స్థాయి కార్యాలయాల్లో సమర్పించి, అక్కడ పరిష్కారం కాని అంశాలను మాత్రమే జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ఉదయం 10.00 గంటలకు ప్రారంభమయ్యే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ం

## తెలుగు నాటక రంగానికి
## బళ్ళారి రాఘవ సేవలు చిరస్మరణీయం.

-బళ్ళారి రాఘవ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం.

-డిఆర్ఓ డి. రాము నాయక్.




పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. తెలుగు సాహిత్యంలో ప్రజాకవి, సమాజ సంస్కర్త, నాటకరంగ ప్రస్థానానికి విశిష్ట సేవలందించిన బళ్ళారి రాఘవ జీవిత విశేషాలు, సమాజానికి చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని జిల్లా రెవెన్యూ అధికారి డి. రాము నాయక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బళ్ళారి రాఘవ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా డిఆర్ఓ డి. రాము నాయక్ మాట్లాడుతూ బళ్ళారి రాఘవ తెలుగు నాటక రంగానికి కొత్త ఒరవడి తీసుకువచ్చి, సహజ నటనకు ప్రాధాన్యం కల్పించారని తెలిపారు. సామాజిక చైతన్యం, మానవతా విలువలు, స్త్రీ గౌరవం వంటి అంశాలను తన నాటకాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లి సమాజ సంస్కరణకు విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. తెలుగు, కన్నడ, ఆంగ్ల భాషలపై పట్టు కలిగిన ఆయన రంగస్థల నటుడిగానే కాకుండా రచయితగా, దర్శకుడిగా, సంఘ సంస్కర్తగా చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. బళ్ళారి రాఘవ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని డిఆర్ఓ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి సునిల్ కన్నా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంజుమన్ ఆధ్వర్యంలో పదవతరగతిలో ఉత్తీర్ణత సాధించిన 530 మంది ముస్లీం విద్యార్ధులకు  నగదు చెక్కులు పంపిణీ.







పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణంలోని స్థానిక అంజుమన్ షాదిహాన లోగత పద్దెనిమిది సంవత్సరాలుగా పంపిణి చేస్తున్నట్లుగానే ఈ సంవత్సరం పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన ముస్లీం విద్యార్థిని, విద్యార్థులకు ఒక్కొక్కరికి రు.3000/- చొప్పున 530 మంది విద్యార్థులకు రూ. 16,90,000/- పంపిణి చేసారు. ఆదివారం స్థానిక అంజుమన్ షాది ఖానాలో అంజుమన్ సంస్థ అధ్యక్షులు హాజి నశ్యం అబ్దుల్ ఖుద్దూస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నగదు చెక్కులు పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో ఇమాముల సంఘం అధ్యక్షులు హాఫీజ్ అమ్జద్ బాషా సిద్దీఖ్, జమాఆతె ఇస్లామీ హింద్ పట్టణ అధ్యక్షులు అబ్దుల్ సమద్, అంజుమన్ ఉపాధ్యక్షులు అబ్దుల్ హాఖ్, కార్యదర్శి వరంగల్ గౌస్, సభ్యులు హిదాయత్ ఖాన్, జీ. యం. మొహిద్దీన్, హుసేన్ బాషా (మున్నా), ఉపాధ్యాయులు ప్రసాద్ విద్యార్థుల తల్లితండ్రులు భారీ ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా  ఖుద్దూస్ మాట్లాడుతూ అంజుమన్ ఆధ్వర్యంలో సేవలు వివరిస్తు ప్రతి సంవత్సరం విద్యార్థులకు స్కాలర్షిప్స్, పేద ముస్లిం వనితల సామూహిక వివాహాలు నిర్వహించి ప్రతి జంటకు 50,000/- నగదు, నిఖా ఖర్చులు భరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం రమజాన్ నెలలో మస్జిద్ లకు రెండేసి చొప్పున జానిమాజ్లు పంపిణి చేస్తున్నట్లు తెలిపారు. పేదవారికి అంజుమన్ తలుపులు ఎప్పుడు తెరిచే ఉంటాయని ప్రకటించారు. ఈ సమావేశంలో సమద్, అమ్జద్ మాట్లాడుతూ అంజుమన్ సేవలు నంద్యాల ముస్లింలకు తలమానికం అని, ఫుర్ఖాన్ ఖబరస్థాన్ అభివృద్ధికి కోటి రూపాయలు అంజుమన్ తరుపున ఇవ్వనున్నట్లు ఖుద్దూస్ ప్రకటించారని మెడికల్ లో ప్రభుత్వ సీటు సాధించిన పేద అమ్మాయిలకు ఐదు సంవత్సరాల ప్రభుత్వ ఫీజు చెల్లించటానికి అంజుమన్ సిద్ధంగా ఉందని తెలిపారు. పేద మహిళలు దుబారా ఖర్చులకు పోకుండా అంజుమన్ ఆధ్వర్యంలో వివాహితులు ముందుకు రావాలని ముస్లిం సమాజాన్ని కోరారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్) సందర్భంగా నిజమైన ఓటర్ల రక్షణకు
## ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికేట్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి.




పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ ఐ ఆర్) ప్రక్రియ నేపథ్యంలో, రాష్ట్రంలోని లక్షలాది మంది నిజమైన ఓటర్లు అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు.

ప్రత్యేకించి మైనారిటీలు, ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, వలస కార్మికులు, నిరక్షరాస్యులు మరియు గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు అవసరమైన పత్రాలను సమకూర్చుకోవడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం. అందువల్ల కేవలం పత్రాల కొరత వల్ల ఏ నిజమైన అర్హుడైన ఓటరు కూడా ఇబ్బందులు ఎదుర్కోకూడదనే ఉద్దేశంతో నంద్యాల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ( ఎన్ ఎం జి ఏ సి) మరియు ఆల్ మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ -- ఆంధ్రప్రదేశ్ సంయుక్తంగా ఒక 50 పేజీల సమగ్ర పాలసీ మెమోరాండం ను( జీవో విడుదల చేయడానికి అనుకూలంగా) రూపొందించాయి. ఈ విధాన ప్రతిపాదనలో తెలంగాణ ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్. 172, తేదీ 25-07-2026 ద్వారా అమలు చేసిన “ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికేట్” విధానాన్ని అధ్యయనం చేసి, అదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఫుడ్ సెక్యూరిటీ కార్డు (రేషన్ కార్డు) డేటాబేస్ ఆధారంగా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికేట్ జారీ చేసే విధంగా ప్రభుత్వం ఒక ప్రభుత్వ ఉత్తర్వు (జీవో) జారీ చేయాలని ప్రతిపాదించాము. ఈ ప్రతిపాదన వల్ల నిజమైన పౌరులకు అవసరమైన కుటుంబ ధృవీకరణ పత్రం సులభంగా లభిస్తుంది.

ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బందులు తగ్గుతాయి. మీ సేవ ద్వారా పారదర్శకంగా, కాలపరిమితిలో సేవలు అందించవచ్చు.

డిజిటల్ గవర్నెన్స్ మరింత బలోపేతం అవుతుంది. ముఖ్యంగా పేదలు మరియు బలహీన వర్గాలకు గొప్ప ఉపశమనం లభిస్తుంది.

ఈ అంశంపై ఇప్పటికే మేము మా సమగ్ర పాలసీ మెమోరాండం ను క్రింది గౌరవనీయులకు సమర్పించాము: గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ కి. ఆంధ్రప్రదేశ్ ముఖ్య ఎన్నికల అధికారి ( చీఫ్ ఎలక్ట్రికల్ ఆఫీసర్) కి.

రాష్ట్ర ముఖ్య కార్యదర్శికి. గౌరవ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి  ఎన్.ఎం.డి. ఫరూక్ కి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గౌరవ సలహాదారు గౌరవ ఎమ్మెల్సీ జనాబ్ షరీఫ్ కి, ఆంధ్రప్రదేశ్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ కి. తెలుగుదేశం పార్టీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు  ఫరూక్ షుబ్లీ కి

ఇతర సంబంధిత ప్రజాప్రతినిధులు మరియు అధికారులకు ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ మైనారిటీ మరియు న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి. ఫరూక్ ని వ్యక్తిగతంగా కలిసి మా ప్రతిపాదనను వివరించాము. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ అంశాన్ని గౌరవ ముఖ్యమంత్రి  నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వం జీవో జారీ చేసే దిశగా కృషి చేస్తానని ఆయన సానుకూలంగా స్పందించారు. ఇందుకు ఆయనకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము

అదేవిధంగా ఇతర గౌరవనీయులు కూడా మా వినతిని సానుకూలంగా స్వీకరించి పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

మా ఈ ప్రతిపాదన ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా గానీ, వ్యతిరేకంగా గానీ కాదు. అలాగే ఇది ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ అధికారాలను ప్రశ్నించే ప్రయత్నం కూడా కాదు. మా ఏకైక లక్ష్యం, చట్టబద్ధమైన విధానంలో నిజమైన అర్హులైన ఓటర్లకు అవసరమైన పరిపాలనా సౌలభ్యం కల్పించడం మరియు ప్రభుత్వ సేవలను మరింత ప్రజానుకూలంగా మార్చడం.

కాబట్టి గౌరవ ముఖ్యమంత్రి  నారా చంద్రబాబు నాయుడు  ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించి, తెలంగాణ రాష్ట్రాల మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఫుడ్ సెక్యూరిటీ కార్డు డేటాబేస్ ఆధారంగా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికేట్ జారీకి సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయాలని మేము వినయపూర్వకంగా కోరుతున్నాము. ఈ నిర్ణయం తీసుకుంటే రాష్ట్రంలోని లక్షలాది మంది నిజమైన పౌరులకు ఉపయోగపడటమే కాకుండా, ఆంధ్రప్రదేశ్ డిజిటల్ గవర్నెన్స్ మరియు ప్రజాకేంద్రిత పరిపాలనలో మరో ముందడుగు వేస్తుందని మా ప్రగాఢ విశ్వాసం. ఈ కార్యక్రమంలో నంద్యాల ముస్లిం జేఏసీ కన్వీనర్ మౌలానా అబ్దుల్లా రషాది, గౌరవ అధ్యక్షులు ఎస్. మొహమ్మద్ అబులైస్, ఆల్మేవ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఇమ్రాన్ పాషా, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు  సయ్యద్ మహమ్మద్ ఫరూక్  షేక్ మహమ్మద్ గౌస్ , కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కోకన్వీనర్ మస్తాన్, వెల్ఫేర్ పార్టీ అధ్యక్షులు అన్సర్ బాష, జేఏసీ యూత్ లీడర్ జకిఉల్లా, గాజుల మహమ్మద్ ఖాసిం , అయ్యూబ్ ,  మహమ్మద్ నౌమన్ బాష, నూరుల్లా. ఖుదుస్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న మిత్రుడికి ఆర్థిక సాయం

**-రూ.30 వేల చేయూత అందించిన కీసర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2010--11 విద్యా సంవత్సరపు పూర్వ విద్యార్థులు**



కీసర, ఆగస్టు 2 (పల్లె వెలుగు): స్నేహితుల దినోత్సవం సందర్భంగా కీసర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2010--11 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు మానవత్వాన్ని చాటుకున్నారు. ఆరోగ్య సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమ సహపాఠి సీహెచ్ మధుకు రూ.30 వేల ఆర్థిక సాయాన్ని అందించి స్నేహబంధం గొప్పతనాన్ని మరోసారి నిరూపించారు. మధు ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్న సహపాఠులు వెంటనే స్పందించి, తమ వంతు విరాళాలను స్వచ్ఛందంగా సమీకరించి రూ.30 వేల సహాయ నిధిని అందించారు. అనంతరం ఆయనను పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, “మిత్రుడి కష్టం మా కష్టమే. అతడు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు అండగా నిలవడం మా బాధ్యత. అవసరమైతే భవిష్యత్తులోనూ మా సహాయం కొనసాగుతుంది” అని తెలిపారు. ఆర్థిక సాయం అందుకున్న సీహెచ్ మధు, తనను మరచిపోకుండా అండగా నిలిచిన సహపాఠులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా చేపట్టిన ఈ మానవతా కార్యక్రమం స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది. కష్టకాలంలో మిత్రుడికి చేయూతనివ్వడమే నిజమైన స్నేహానికి నిదర్శనమని ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది.



# సమాజ మార్పుకై నాటకరంగ కళను ఆయుధంగా మలిచిన మహనీయుడు..

● తెలుగు నాటక రంగ పితామహుడు బళ్ళారి రాఘవ. ● అడిషనల్ ఎస్పి అడ్మిన్ ఎస్. ఖాదర్ బాషా.

పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. తెలుగు నాటక రంగానికి ప్రాణం పోసిన మహనీయుడు, గొప్ప సామాజిక సేవకుడు శ్రీ బళ్ళారి రాఘవ జయంతిని పురస్కరించుకుని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాలమేరకు నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ శాఖ తరపున ఎస్పీ అడ్మిన్ ఎస్. ఖాదర్ భాషా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.

ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్. ఖాదర్ బాషా మాట్లాడుతూ బళ్ళారి రాఘవ కేవలం ఒక నాటక కళాకారుడు మాత్రమే కాదని, తన కళ ద్వారా సమాజంలో నెలకొన్న




దురాచారాలను ప్రశ్నించిన గొప్ప సంస్కర్త అని కొనియాడారు. ఆయన ప్రదర్శనలు కేవలం వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా, ప్రజల్లో ఆలోచనలు రేకెత్తించి, నైతిక విలువలను పెంపొందించేలా ఉండేవని గుర్తుచేశారు.

సమాజంలో మానవత్వం వంటి ఉన్నత విలువలను తన జీవితాంతం పాటించిన బళ్ళారి రాఘవ జీవితం యువతకు ఎంతో ఆదర్శప్రాయమని అదనపు ఎస్పీ పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా తమ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ, సమాజానికి మేలు చేయడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ తోపాటు ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ చిన్నికృష్ణ గారు, రిజర్వు ఇన్స్పెక్టర్లు బాబు ,విజయ్ ,సురేష్ ఆర్ ఎస్ ఐ లు హర్షవర్ధన్ రెడ్డి, చరణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పేలుడుతో ఉలిక్కిపడ్డ చిన్నదేవలాపురం

● ప్రాణాపాయ స్థితి నుండి బయటపడ్డ వృద్ధ దంపతులు ● గ్యాస్ లీకే కారణం





బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 2 : బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న చిన్నదేవులాపురం గ్రామంలో ఆదివారం భారీ పేలుడు సంభవించడంతో ఆ గ్రామ ప్రజలు భయాందోళనకు గురైన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి కారణంగా ఊరంతా ఉలికిపాటుకు గురైంది. చిన్న దేవలాపురం గ్రామానికి చెందిన పుట్టుపల్లి సుబ్బరాయుడు (64) భార్య పుట్టుపల్లి నాగమ్మ (56) తో కలిసి ఆదివారం ఉదయం ఉపాధి పనులకు వెళ్లడం జరిగింది. పనులు ముగించుకొని దంపతులిరువురు ఇంటికి చేరుకున్నారు. అప్పటికే ఇంట్లో ఉన్న హెచ్పీ గ్యాస్ సిలిండర్ లీక్ అవుతూ ఉండడంతో గ్యాస్ అంతా ఇంట్లో ఆవహించింది. ఇది గమనించని నాగమ్మ గ్యాస్ స్టవ్ ను అంటించే ప్రయత్నం చేయడంతో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. దీనితో పుట్టుపల్లి సుబ్బరాయుడు కు కాళ్లకు బలంగా గాయాలయ్యాయి. భార్య నాగమ్మ తలకు చేతులకు పాక్షి కంగా గాయాలయ్యాయి. దురదృష్టవశాత్తు సిలిండర్ పేలిపోయి ఉంటే, పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరిగి ఉండేది. సిలిండర్ పే లకపోవడంతో, స్వల్ప గాయాలతో వృద్ధ దంపతులు బయటపడగలిగారు. పేలుడు కారణంగా ఇంటి వాకిలి కూడా ధ్వంసం అయింది. ఇంట్లో నీ నిత్యవసర వస్తువులన్నీ పేలుడు దాటికి ధ్వంసం అయిపోయాయి. ఈ సంఘటన తెలిసి వెంటనే చుట్టుపక్కల ఉన్న ప్రజలు వారిని సురక్షితంగా బయటకు తెచ్చి చికిత్సలు చేశారు. చికిత్సల నిమిత్తం దంపతులు ఇరువురిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.



**సిలిండర్ లీకు కావడం వల్లే ప్రమాదం**

చిన్నదేవలాపురంలో సిలిండర్ లీకు కావడం వల్లే ఇరువురు దంపతులు ప్రమాదానికి గురికావాల్సి వచ్చిందని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలో తరచూ లీకుల సిలిండర్లు వస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. సిలిండర్ ను నింపే సమయంలో వాచర్ ను మార్చాల్సి ఉన్న, కంపెనీ నిర్వాహకులు ఈ విషయంలో జాగ్రత్తలు వహించడం లేదని పేర్కొంటున్నారు. గ్యాస్ ఏజెన్సీలు సిలిండర్ను సరఫరా చేసే సమయంలో, వినియోగదారులకు సిలిండర్లను దించిపోతున్నారు. నిబంధనల ప్రకారం సిలిండర్ అన్లోడ్ చేసిన తర్వాత వినియోగదారుల ఇంట్లోకి వెళ్లి సిలిండర్ను బిగించి లీకూ వస్తుందా లేదా అన్న విషయాలను పరిశీలించాల్సి ఉంది. ఈ నిబంధనలను ఎవరు కూడా పాటించడం లేదు. తర్వాత మహిళలు సిలిండర్ ను ఏర్పాటు చేసుకునే సమయంలో గ్యాస్ వాసనలు వస్తూ ఉండటంతో, ఈ విషయంపై చాలా గ్రామాలలో మహిళలు ఆందోళన చెందుతున్నారు. గ్యాస్ సిలిండర్ పై అవగాహన ఉన్న కొందరు వ్యక్తులతో మహిళలు మరమ్మత్తులు చేయించుకుంటున్నారు. గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసే సమయంలో నిర్వాహకులను వాచర్లు అడిగినప్పటికీ లేవని చేతులెత్తేస్తున్నారు. ఐదు రూపాయల విలువచేసే వాచర్లను కూడా నిర్వాహకులు ఇవ్వడం లేదని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# లయన్స్ సేవా సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్ రవి కృష్ణ.

**గుత్తిలో జరిగిన లయన్స్ జిల్లా 316 జె 9వ జిల్లా క్యాబినెట్ సదస్సులో.**
**ప్రమాణ స్వీకారం చేయించిన మాజీ అంతర్జాతీయ లయన్స్ సేవా సంస్థ డైరెక్టర్ మదన్ మోహన్.**





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. లయన్స్ అంతర్జాతీయ సేవా సంస్థ లో నంద్యాల, కర్నూలు, కడప, అన్నమయ్య, తిరుపతి అనంతపురం, సత్యసాయి, నెల్లూరు జిల్లాల లయన్స్ క్లబ్ లో తో కూడిన లయన్స్ జిల్లా 316 జె లయన్స్ జిల్లా గవర్నర్ విరూపాక్ష రెడ్డి అధ్యక్షతన ఆదివారం గుత్తిలో జరిగిన నూతన క్యాబినెట్ ప్రమాణ స్వీకార కార్యక్రమం లో నంద్యాల కు చెందిన డాక్టర్ రవి కృష్ణ తో రెండవ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా అంతర్జాతీయ లయన్స్ సేవా సంస్థ మాజీ అంతర్జాతీయ డైరెక్టర్ మదన్ మోహన్ పదవి ప్రమాణ స్వీకారం చేయించారు. గూడూరు కు చెందిన వెంకటేశ్వరరావు ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా, గ్లోబల్ యాక్షన్ టీం చైర్మన్ లు గా రవి ప్రకాష్, సుధాకర్ రెడ్డి నంద్యాల కు చెందిన నిజాముద్దీన్, సూళ్లూరుపేటకు చెందిన డాక్టర్ ఆదిశేషారెడ్డి, రీజియన్ చైర్మన్ లు గా, నంద్యాలకు చెందిన సోమేశుల నాగరాజు తో పాటు 17 మంది జోన్ చైర్మన్ లు పదవి ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ రానున్న మూడు సంవత్సరాల లో లయన్స్ సేవా సంస్థ ద్వారా డిస్ట్రిక్ట్ 316 జె లో ఉన్న 50 కి పైగా క్లబ్బులలో, ఆయా క్లబ్బుల సభ్యుల సహకారంతో, గవర్నర్ విరూపాక్ష రెడ్డి, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వెంకటేశ్వరరావు లతో కలసి సేవా కార్యక్రమాలను ముమ్మరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి లయన్స్ సీనియర్ నాయకులు అంబటి సుధాకర్ రెడ్డి, మూల్పూరు ఉపేంద్ర, ఆంధ్రప్రదేశ్ లయన్స్ సమాఖ్య మాజీ చైర్మన్ ఏ వి ఆర్ ప్రసాద్, డాక్టర్ గోపాలరావు, అనిల్ జైన్, పాపారావు, వేణుబాబు, గద్దె శేషగిరి,మాజీ లయన్స్ జిల్లా గవర్నర్లు నాగేశ్వరరావు, మాణిక్య ప్రభు,డి ఎస్ కుమార్, చిన్నపరెడ్డి, కిషోర్,రమేష్ నాద్ రెడ్డి, రామ చంద్ర ప్రకాష్, గౌతమ్, గోపాలకృష్ణ, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్, సీనియర్ సభ్యులు శ్రీకాంత్, రవి ప్రకాష్, సుధాకర్ రెడ్డి, నిజాముద్దీన్, సోమేశుల నాగరాజు,బైసాని రమేష్, మహేశ్వర్ రెడ్డి, చంద్రమోహన్, కసెట్టి చంద్రశేఖర్,ఇమ్మడి రామకృష్ణుడు, కన్నయ్య,జనార్ధన్, సురేష్,ఆంధ్ర ప్రదేశ్ లో ఉన్న 5 లయన్స్ జిల్లాల గవర్నర్లు,వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు, గ్రేటర్ రాయలసీమ లో ఉన్న 8 జిల్లాల పరిధిలోని లయన్స్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రికెట్ పోటీలో రెవెన్యూ శాఖ విజయం..

☛అత్యధిక స్కోర్ సాధించిన జాయింట్ కలెక్టర్..

☛138 పరుగుల తో రెవెన్యూ జట్టు ఆర్జీఎం జట్టు పై విజయం.





పాణ్యం ఆగస్టు 2 పల్లె వెలుగు: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ నంద్యాల జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలో రెవెన్యూ శాఖ 138 పరుగుల తో ఆర్ జి యం జట్టుపై విజయం సాధించినట్లు జిల్లా అధ్యక్షుడు కామేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆర్ జి యం ఇంజనీరింగ్ కళాశాలలో రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖ, ఆర్జిఎం జట్ల మధ్య క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో 20 ఓవర్లలో ఆరు వికెట్లకు138 పరుగులు చేసి ఐదు పరుగుల తేడాతో ఆర్ జి యం జట్టుపై రెవెన్యూ జట్టు విజయం సాధించారన్నారు. ఈ పోటీలో జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ఘనోరి అత్యధికంగా41 పరుగులు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఆర్డీవో చెల్లా విశ్వనాథ్, ఆంధ్ర ప్రదేశ్ రెవిన్యూ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షులు కామేశ్వర రెడ్డి కార్యదర్శి రామచంద్ర రావు, వాడిని తహసిల్దారు ప్రవీణ్ కుమార్, నంద్యాల అర్బన్ తహసిల్దారు శ్రీనివాసులు, పిడి వెంకటేష్, రెవెన్యూ, ఆర్ జి యం కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# అటవి శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

మహానంది, పల్లె వెలుగు మహానంది మండలంలోని ఆర్ఎస్ గాజుల పల్లె, పచ్చర్ల గ్రామాల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చలమ




ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాగభూషణం మాట్లాడుతూ.. అటవీ శాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు హైదరాబాద్ లోని అపెక్స్ హెల్త్ కేర్ డాక్టర్లు జక్కుల సాయి కుమార్ వారి బృందం గిరిజన ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారని తెలిపారు. ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స పొందడం చాలా ముఖ్యమని చెప్పారు.గ్రామ ప్రజల ఆరోగ్యం మా మొదటి ప్రాధాన్యం అని,అందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో నాగేశ్వరరావు, ఎఫ్ ఎస్ ఓ విజయ వర్ధన్, ఎఫ్బి ఓ హర్షద్, సిబ్బంది పాల్గొన్నారు.

# లేబర్ కార్డు ఉంటే ప్రయోజనాలు



బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 2 : కార్మికులు లేబర్ కార్డు ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం ద్వారా అనేక ప్రయోజనాలను పొందవచ్చునని నేతాజీ భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కమిటీ పేర్కొంది. ఆదివారం బండి ఆత్మకూరులో కమిటీ భావన నిర్మాణ కార్మికుడు రిజ్వాన్ అధ్యక్షతన ఒక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి బియ్య గారి చాంద్ బాషా మాట్లాడుతూ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు అనేక ప్రయోజనాలను కల్పిస్తుందని అన్నారు. కార్మికులకు వివిధ రుణాలను మంజూరు చేయించడమే కాకుండా సంఘంలో లేబర్ కార్డు కలిగిన వారికి ఈ శ్రమ కార్డు కలిగిన వారికి వారి కుటుంబంలోని మహిళలు లబ్ధి పొందవచ్చు అని అన్నారు. కార్మిక కుటుంబాలలోని మహిళలు మొదటి రెండు కాన్పుల వరకు 20వేల రూపాయలను పొందే అవకాశం ఉంటుందని అన్నారు. కుటుంబంలో ఆడపిల్లలకు వివాహాల సందర్భంగా 20వేల రూపాయలను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. కమిటీ ఏర్పడిన తర్వాత మండలంలో మూడు కుటుంబాల వారికి కాన్పుల సందర్భంగా 20వేల రూపాయలు వారి బ్యాంకు అకౌంట్లో జమ చేయడం జరిగిందని అన్నారు. భావన నిర్మాణ కార్మికులందరూ లేబర్ కార్డులను కలిగి ఉండాలని కమిటీ విద్యార్థి చేసింది. లేబర్ కార్డు లేని వారు కూడా కార్డులనిపించేందుకు కృషి చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు జోరుద్దీన్, రిజ్వాన్, తిరుపతి, కార్పెంటర్ మాలి,పాలిష్ కట్టర్ ఖాదర్,దర్గా గణపతి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కామేశ్వరి అమ్మవారికి ఆషాడం సారె సమర్పణ





మహానంది, పల్లె వెలుగు మహానంది క్షేత్రంలో వెలిసిన శ్రీ కామేశ్వరి దేవి అమ్మవారికి ఆషాఢ సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఆదివారం శ్రీ బాలాజీ సేవ ట్రస్ట్ వ్యవస్థాపకులు ధనుంజయ రెడ్డి ఆధ్వర్యంలో వందలాది మంది మహిళలు గరుడనంది నుంచి శోభాయాత్రగా సంకీర్తనలు,కోలాటాలు, భజనలతో కోలాహలంగా ఆలయానికి చేరుకున్నారు. వీరికి ఈవో శ్రీనివాసరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు శ్రీ కామేశ్వరి మహానందీశ్వర స్వామివార్లకు పట్టువస్త్రాలు, సౌభాగ్య ద్రవ్యాలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. అనంతరం సామూహిక లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చన పూజలు చేశారు. శివనామ సంకీర్తనలతో మహానంది క్షేత్రంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

## నేడు కర్నూలు నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

### -నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు నగరపాలక సంస్థలో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ చల్లా ఓబులేసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:00 గంటలకు స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి నగరపాలకకు చెందిన అన్ని విభాగాల అధికారులు హాజరు అవుతారని, కాలనీల్లోని మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, వీధి వెలుగులు, పరిశుభ్రత వంటి సమస్యలను ప్రజలు లిఖిత పూర్వకంగా సమర్పించవచ్చని తెలిపారు. ప్రతి ఫిర్యాదు స్వీకరించబడిన వెంటనే సంబంధిత అధికారులకు పంపి, పరిష్కారం కోసం నిర్దిష్ట గడువులు నిర్ణయించబడతాయని ఆయన వెల్లడించారు. అదేవిధంగా, ప్రతి ఫిర్యాదు పురోగతిని పౌరులు స్వయంగా ఫ్ట్రిజూం://వీవవఎశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని కమిషనర్ వివరించారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న రామకృష్ణకు రూ.50 వేల ఆర్థిక సాయం

☛కలచట్ల నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన బలిజ సంఘం

☛పిల్లల చదువుకు, భవిష్యత్తుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ



పల్లె వెలుగు –?ప్యాపిలి ప్యాపిలి మండల పరిధిలోని కలచట్ల గ్రామానికి చెందిన అరికెచర్ల రామకృష్ణకు ప్యాపిలి మండల బలిజ సంఘం నాయకులు, సభ్యులు ఆదివారం రూ. 50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ?ఇటీవల కాలంలో రామకృష్ణ తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో, ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం బలిజ సంఘీయులు తమ వంతు బాధ్యతగా ఈ సహాయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ... అనారోగ్యంతో బాధపడుతున్న రామకృష్ణ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ఆ కుటుంబానికి అవసరమైన సూచనలు ఇస్తూ, వారి పిల్లల చదువులకు భవిష్యత్తుకు తగిన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ?ఆపదలో ఉన్న స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయం అందించిన బలిజ సంఘ సభ్యులకు గ్రామస్థులు, స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్యాపిలి పట్టణ బలిజ సంఘ నాయకులు, ప్రతినిధులు స్థానికులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

మహానంది, పల్లె వెలుగు రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడికి గాయాలైన ఘటన మహానంది మండలం గాజులపల్లెలో చోటుచేసుకుంది. ఆదివారం స్థానికుల వివరాల మేరకు..విభూది పెద్ద జమ్ములన్న (65) అనే వృద్ధుడు టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గాజులపల్లె –నంద్యాల రహదారిలోని ఆక్సి రిచ్ వాటర్ ప్లాంట్ సమీపాన ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతనికి గాయాలు కాగా 108 వాహనంలో ఉదయానంద ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై మహానంది పోలీసులు విచారణ చేపట్టారు.

# స్నేహానికన్నా మిన్న లోకాన లేదురా

పల్లె వెలుగు:"ఒక మంచి పుస్తకం వంద మంది



స్నేహితులతో సమానం. కానీ ఒక మంచి స్నేహితుడు ఒక గ్రంథాలయంతో సమానం"లి అని మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏ.పి.జే. అబ్దుల్ కలాం పేర్కొన్నారు స్నహానికన్నా మిన్న ఈ లోకంలో మరొక బంధం లేదు. కలిసి నడిచే అడుగుల్లో కష్టాలు చిన్నవిగా అనిపిస్తాయి. కన్నీరు తుడిచే చేతికి స్వార్థం ఉండదు. కల్మషం లేని చిరునవ్వులకు స్నేహమే వేదిక. నిజమైన స్నేహం రెండు శరీరాల్లో ఒకే ఆత్మ నివసించినట్లుంటుంది. స్నేహితుడితో బాధలను పంచుకుంటే అవి సగం అవుతాయి. ఆనందాన్ని పంచుకుంటే అది రెట్టింపు అవుతుంది. అవగాహనే స్నేహానికి బలమైన పునాది. కాలం మారినా, లోకం మారినా నిజమైన స్నేహబంధం మారదు. జీవిత ప్రయాణంలో స్నేహమే శ్రీరామరక్ష. ఆశల తీరానికి చేర్చే చుక్కాని, నిరాశ చీకట్లను చీల్చే వెలుగు స్నేహమే. స్నేహం కలకాలం నిలిచే బంధం. కష్టాల చీకటిలో వెలిగే దీపం. భవిష్యత్తుకు దారి చూపే మార్గదర్శి. చిరునవ్వుల తోటలో
విరబూసిన పుష్పంలా మన స్నేహం నిలవాలి. మాటలకు అందని మనసుల అనుబంధం, మౌనం తెలిపే మమతల వంతెన స్నేహం. అపార్థాల అలలు ఎన్ని వచ్చినా ఆత్మీయత అనే తీరానికి చేర్చే నావ స్నేహమే. ప్రపంచమంతా ఎదురైనా నా వెన్నంటే నిలిచే ధైర్యం స్నేహం. నా తప్పులను సరిదిద్ది సరైన మార్గం చూపే గురువు స్నేహితుడు. నా విజయాన్ని తన విజయంగా భావించి ఆనందపడేది నిజమైన స్నేహమే. స్నేహం ఈ సృష్టిలో అపురూపమైన కావ్యం. యుగాలు గడిచినా చెరిగిపోని జ్ఞాపకం. మరణం కూడా విడదీయలేని పవిత్రమైన బంధం. "నువ్వు నా పక్కన ఉంటే చాలు నేస్తమా... ప్రతి రోజూ పండుగే" అనే భావన ప్రతి హృదయంలో నిలవాలి. స్నేహహస్తం అందించి సామాజిక ఉద్రిక్తతలను దూరం చేద్దాం. పరస్పర ప్రేమ, గౌరవం, ఆత్మీయతతో సామాజిక శాంతిని నెలకొల్పుదాం. "స్నేహం లేకపోతే జీవితంలో ఏదీ
లేదు. అన్ని సంపదలు ఉన్నప్పటికీ స్నేహితులు లేని జీవితం వ్యర్థం"లి అని అరిస్టాటిల్ చెప్పిన మాటలు ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలి. "స్నేహం వ్యాపారం కాదు...
అది ప్రతిఫలం ఆశించని పవిత్రమైన బంధం"లి అని స్వామి వివేకానంద పేర్కొన్నారు. యువత ఈ విలువలను తమ జీవనశైలిగా మలుచుకోవాలి. స్నేహం ఆందోళనలకు దూరంగా, ఆనందానికి దగ్గరగా తీసుకెళ్లే జీవన మార్గం కావాలి. (ఆగస్టు 2 -- స్నేహితుల దినోత్సవం సందర్భంగా)-- నేదునూరి కనకయ్యలిలి అధ్యక్షులు, తెలంగాణ ఎకనామిక్ ఫోరం కాలమిస్ట్, రచయిత, కరీంనగర్.

## నేడు మహానంది దేవస్థానం పాలకమండలి ప్రమాణ స్వీకారం..



**పాలకమండలి చైర్మన్ గా నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డి..**



మహానంది, పల్లె వెలుగు మహానంది దేవస్థానానికి రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు నూతనంగా నియమింపబడిన పాలకమండలి నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. 12 మంది పాలక మండలి సభ్యులతో పాటు ఒక ఎక్స్ అఫిషియో సభ్యుడు కలిసి 13 మంది ప్రమాణ స్వీకారం చేయనున్నారు. దేవస్థానం నూతన పాలక మండలి చైర్మన్‌గా మసీదుపురం గ్రామానికి చెందిన నరాల చంద్రమౌళీశ్వర రెడ్డిని చైర్మన్ గా ఎన్నుకోనున్నారు. బోర్డు సభ్యులు తురగ నాగలక్ష్మమ్మ, ఎం. కాశీనాయక్, పొత్తూరు ధనూష,లాలం నాగార్జున, అన్నెపోగు విజయుడు, చింతా నాగేశ్వరరావు, కాటేపోగు రామేశ్వరమ్మ, ముక్కమల్ల ఆదిశేషుడు, కొల్లి దీప, గుద్దేటి రమాదేవి, అను రాధతో పాటు ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఆలయ ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మల ప్రమాణస్వీకారం జరగనుంది. ఈ మేరకు దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమానికి శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నారు. వీరి చేత దేవస్థానం అధికారులు ప్రమాణస్వీకారం చేపించనున్నారు.

## అర్థరాత్రి అరెస్టులు... ప్రజాస్వామ్యానికి అర్థరాత్రి చీకట్లు!

☛ వైకాపా రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కురువ శశికళ కృష్ణమోహన్







ఆదోని (పల్లె వెలుగు) : ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టును తీవ్రంగా ఖండించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కురువ శశికళ కృష్ణమోహన్
ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని అర్థరాత్రి వేళ అరెస్టు చేసిన ఘటన తీవ్ర ఆందోళన కలిగించిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కురువ శశికళ కృష్ణమోహన్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతిపక్ష ప్రజాప్రతినిధులతో వ్యవహరించే తీరు ఇదేనా అని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకుని అధికార యంత్రాంగాన్ని రాజకీయ ప్రయోజనాలకు వినియోగిస్తున్నారనే అభిప్రాయం ప్రజల్లో బలపడుతోందని ఆమె అన్నారు, ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకలను అణచివేయడానికి అర్థరాత్రి అరెస్టులు, బెదిరింపులు, ఒత్తిళ్లు వంటి చర్యలు అవలంబించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. "ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేను అర్థరాత్రి అరెస్టు చేయడం ద్వారా ప్రభుత్వం ఎలాంటి సందేశాన్ని ఇవ్వాలనుకుంటోంది? ప్రజల సమస్యలను ప్రశ్నిస్తే ఇదే పరిస్థితి ఎదురవుతుందా? అధికార అహంకారంతో వ్యవహరించే ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని" అని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు
ప్రజాస్వామ్యంలో విభిన్న స్వరాలను గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని, కానీ ప్రస్తుతం ప్రశ్నించే వారిపై ఒత్తిడి తెచ్చే ధోరణి కనిపిస్తోందనే ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ విభేదాలను చట్టపరమైన చర్యల రూపంలో పరిష్కరించే ప్రయత్నాలు ప్రజాస్వామ్య విలువలను బలహీనపరుస్తాయని ఆమె అన్నారు. అధికారం శాశ్వతం కాదు ప్రజా తీర్పే శాశ్వతం. అధికారం మదంతో వ్యవహరించే ప్రతి ప్రభుత్వానికి ప్రజలే అంతిమ న్యాయమూర్తులని, అధికార బలం ఎంత ఉన్నా ప్రజా బలం ముందు నిలవదని కురువ శశికళ కృష్ణమోహన్ వ్యాఖ్యానించారు.
చట్టం అందరికీ సమానంగా వర్తించాలే తప్ప రాజకీయ ప్రత్యర్థులపై మాత్రమే ఎంపిక చేసుకుని అమలు చేయకూడదని ఆమె డిమాండ్ చేశారు. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టుకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం ప్రజల ముందుంచి పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు.
రాజకీయ కక్షసాధింపులకు తావులేకుండా రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాపాడాలని, ప్రతిపక్షాల పట్ల కక్షపూరిత ధోరణిని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని ఆమె స్పష్టం చేశారు.

# 2 సంవత్సరాల అభివృద్ధి
# సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం.

- 19వ వార్డు ఇంద్రానగర్‌లో ఆదోని టీడీపీ ఇంచార్జి మీనాక్షి నాయుడు జిల్లా టీడీపీ అధ్యక్షులు గుడిసె అది కృష్ణమ్మ.





ఆదోని (పల్లె వెలుగు): డోర్ టు డోర్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు ఆదోని అబ్జర్వర్ కేశవ రెడ్డి గుడిసె శ్రీరాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమాపతి నాయుడు గుడిసె శ్రీరాములు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రాధాన్యత క్రమంలో అమలు చేస్తూ ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు తెలిపారు. రైతన్నకు కొండంత అండగా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సహాయం అందించడంతో పాటు, పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ రైతులను అన్ని విధాలా ఆదుకుంటున్నామని తెలిపారు. మహిళల సాధికారత కోసం మహాశక్తి కింద ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి, ప్రతి కుటుంబానికి ఉచితషి గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి పథకాల ద్వారా మహిళల ఆర్థిక భారాన్ని తగ్గిస్తున్నామని చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, పరిశ్రమల స్థాపన ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు సృష్టిస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మార్కెట్ యార్డ్ చైర్మన్ జిందే శారదా భాయ్, రంగస్వామి నాయుడు, ఏసీ శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ రామకృష్ణ, పట్టణ అధ్యక్షులు తిమ్మప్ప, వడ్డెమన్ గోపాల్ దేవేంద్ర ఉపేంద్ర శేఖర్ నాగరాజు జిందేశంకర్, రంగన్న, ఉమ్మి సలీం, కర్నూల్ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ వైస్ ప్రెసిడెంట్ రంగన్న లక్ష్మీనారాయణ,

ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, వార్డు ఇన్‌చార్జీలు, బూత్ కన్వీనర్లు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాలికపై ప్రైవేటు టీచర్ పైశాచికత్వం

- ప్రశ్నిస్తే ఎదురు దాడికి దిగిన టీచర్





బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 2 : బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఈర్నపాడు గ్రామంలోని డాక్టర్ నరేంద్ర మెమోరియల్ ప్రైమరీ స్కూల్లో అదే గ్రామానికి చెందిన దీవెన(7) బాలికపై అదే గ్రామానికి చెందిన ఓ ప్రైవేటు టీచర్ పైశాచికంగా చితకబాదిన సంఘటన వెలుగులోకి వచ్చింది. అందిన సమాచారం మేరకు ప్రైవేటు స్కూల్లో రెండవ తరగతి చదువుతున్న దీవెనను ప్రైవేట్ టీచర్ చితకబాగింది. దీనితో ఆ బాలికకు వీపు వెనుక విపరీతంగా గాయాలయ్యాయి. ఈ విషయం ఇంట్లో చెబితే నిన్ను చంపేస్తానని బాలికను ప్రైవేటు టీచర్ బెదిరించినట్లుగా తెలుస్తోంది. దీవెన తల్లిదండ్రులైన కొండయ్య నందిని ఆళ్లగడ్డలో స్లాబు పనికి వెళ్లారని తెలుస్తోంది. ప్రైవేట్ స్కూల్ నుండి ఇంటికి వచ్చిన దీవెన తల్లిదండ్రులు లేకపోవడంతో తమ బంధువుల ఇంట్లో తలదాచుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ సంఘటన శనివారం మధ్యాహ్నం జరిగింది. ఆదివారం ఉదయం స్నానానికి వెళ్లి వచ్చిన దీవెన బట్టలు వేసుకోవడానికి అవస్థలు పడుతూ ఉండటంతో, తల్లిదండ్రులు గమనించారు. తమ కూతురు ఒంటిపై గాయాలు చూసి ఆందోళనకు గురయ్యారు. జరిగిన సంఘటన గురించి దీవెన జేజమ్మ ప్రైవేట్ స్కూల్ టీచర్ ను ఈ విషయంపై నిలదీసేందుకు ఆమె ఇంటి వద్దకు వెళ్లినట్టుగా తెలుస్తోంది. జరిగిన సంఘటన గురించి, చెప్పాల్సిన టీచర్ నాగమ్మపై ఎదురుగాడికి దిగింది. దీంతో నాగమ్మ తలకు కూడా రక్త గాయమైంది. ఈ విషయంపై దీవెన తల్లిదండ్రులు ఆదివారం రాత్రి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం. దీవెనపై జరిగిన దాడిని గురించి తెలుసుకున్న కరస్పాండెంట్ పుల్లయ్య ఆమెను విధుల నుంచి తొలగించినట్లుగా సమాచారం. దీవెనపై జరిగిన దాడి పట్ల ఈర్ణ పాడు గ్రామంలో ఆందోళనలు వ్యక్తం అవుతూ ఉన్నాయి.

# ఆళ్లగడ్డ రోటరీ క్లబ్బు సేవలు ప్రశంసనీయం

ఫాస్ట్ ప్రెసిడెంట్ వై పాపిరెడ్డి







ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 2 పల్లె వెలుగు ఆళ్లగడ్డ రోటరీ క్లబ్ సాధారణ సమావేశం ఆదివారం నాడు ఉదయం పట్టణంలోని రోటరీ క్లబ్ సమావేశ భవనంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు పిచ్చల మల్లేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం రోటరీ క్లబ్ ఫాస్ట్ ప్రెసిడెంట్ యర్రం పాపిరెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ముందుగా ప్రార్థన గీతంతో సమావేశం ప్రారంభమైంది ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఫాస్ట్ ప్రెసిడెంట్ పాపిరెడ్డి క్లబ్బు మెంబర్స్ ను ఉద్దేశించి మాట్లాడుతూ ఆళ్లగడ్డ రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయం అని అన్నారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్ష కార్యదర్శులు పోలే పల్లె సత్యనారాయణ బైసాని రవి ప్రకాష్ తమ అమూల్యమైన సేవలతో వారి ఆధ్వర్యంలో క్లబ్బును ముందుకు నడిపించారని మంచి సేవా దృక్పథంతో పనిచేశారన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని రోటరీ క్లబ్ ను నూతన అధ్యక్ష కార్యదర్శులు ఇంకా ముందుకు తీసుకెళ్లాలని ఆయన అభిప్రాయపడ్డారు. యువత ముందుకొస్తున్నారని వారందరి సహకారంతో రోటరీ క్లబ్బుకు నూతన ఒరవడిని ఏర్పాటు చేసుకొని మంచి గుర్తింపు తేవాలని తెలిపారు, అనంతరం మాజీ రోటరీ క్లబ్ ప్రధాన కార్యదర్శి బైసాని రవి ప్రకాష్ క్లబ్బు సేవలు తదితర అంశాలను గురించి క్లుప్తంగా వివరించారు. అనంతరం ప్రధాన కార్యదర్శి గాండ్ల చంద్ర సేన రాబోయే రోజుల్లో రోటరీ క్లబ్ చేసే కార్యక్రమాలు గురించి వివరిస్తూ అందరి సహాయ సహకారాలతో ఆళ్లగడ్డ రోటరీ క్లబ్ ను మరో ముందడుగు వేసే విధంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో అగ్రభాగాన నిలిచేందుకు కృషి చేస్తామన్నారు.

ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ సీనియర్ ఫాస్ట్ ప్రెసిడెంట్ ప్రిన్సిపాల్ శంకర్ రెడ్డి క్లబ్బు సీనియర్లు బ్యాంకు బాలిరెడ్డి, కెవి సుబ్బారెడ్డి మా టీవీ ప్రసాద్ ఎంఎస్ నారాయణరెడ్డి నిచ్చెన మెట్ల రామయ్య సోముల శేఖర్ రెడ్డి శివ చంద్రారెడ్డి,,రేపాకుల శ్రీనివాసులు సూర్య చంద్ర రెడ్డి, డిదస్తగిరి, రవి తదితరులు పాల్గొన్నారు.

# 3,500 బాధితునికి అప్పగించి
## మానవత్వం చాటుకున్న 108 సిబ్బంది

పల్లె వెలుగు –?ప్యాపిలి జాతీయ రహదారి–44 పై ఆదివారం ఉదయం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌ను రక్షించడమే కాకుండా, వాహనంలో



ఉన్న నగదును సురక్షితంగా బాధితుని కుటుంబ సభ్యులకు అప్పగించి 108 అంబులెన్స్ సిబ్బంది తమ నిజాయితీని, మానవత్వాన్ని చాటుకున్నారు. ?పోతుదొడ్డి సమీపంలో ఆదివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఐచర్ వాహనం, ట్రాక్టర్ పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఐచర్ డ్రైవర్ వీరేష్ నూతిమడుగు గ్రామం, కమ్మదూరు మండలం, అనంతపురం జిల్లా క్యాబిన్‌లో చిక్కుకుపోయి తీవ్రంగా గాయపడ్డాడు. అతని కాలు విరగడంతో పాటు శరీరానికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకున్నారు. క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను సురక్షితంగా వెలికితీసి, గోల్డెన్ అవర్‌లో ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుత్తి ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కి తరలించారు. ?ప్రమాదానికి గురైన లారీ డ్యాష్‌బోర్డులో ఉన్న రూ. 23,500 నగదును 108 సిబ్బంది భద్రపరిచి, బాధితుడి సోదరుడికి సురక్షితంగా అప్పగించారు. విపత్తు సమయంలో ప్రాణాలు కాపాడటంతో పాటు నగదును తిరిగి అప్పగించిన 108 సిబ్బంది నిజాయితీని, సమయస్ఫూర్తిని స్థానికులు, ప్రయాణికులు విశేషంగా అభినందించారు.

# నేషనల్ హైవేపై రాంగ్ రూట్ ప్రయాణం:
# 24 వాహనాలకు జరిమానా

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో నేషనల్ హైవేపై నిబంధనలకు విరుద్ధంగా ఆపోజిట్



(రాంగ్) రూట్‌లో వస్తున్న వాహనాలపై పోలీసులు శనివారం కఠిన చర్యలు చేపట్టారు. లక్ష్మీపురం స్టేజి వద్ద హైవేపై ఎదురుగా వస్తూ ప్రమాదాలకు కారణమవుతున్న వాహనాలను నిఘా బృందాలు గుర్తించాయి. నిబంధనలు ఉల్లంఘించిన 24 వాహనదారులను తనిఖీ చేసి, వారికి మొత్తం ?5,045 జరిమానా విధించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. నేషనల్ హైవేలపై రాంగ్ రూట్‌లో ప్రయాణించడం తీవ్రమైన నేరమని, ఇది తోటి వాహనదారుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తుందని హెచ్చరించారు. వాహనదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ హైవేపై రాంగ్ రూట్‌లో ప్రయాణించవద్దని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# 1600 ఏళ్ల చారిత్రక వైభవానికి పునర్జీవం..
## కొలిమిగుండ్ల 'నాలుగు గుళ్ల' పునరుద్ధరణకు శ్రీకారం





కొలిమిగుండ్ల, ఆగస్టు 2 (పల్లె వెలుగు న్యూస్): కొలిమిగుండ్లలో సుమారు 1600 ఏళ్ల చారిత్రక వైభవాన్ని సంతరించుకున్న కొలిమిగుండ్ల గ్రామంలోని ప్రాచీన “నాలుగు గుళ్ల” పునరుద్ధరణ కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. పూర్వసంపద రక్షక సేన ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీసీ ఇందిరా రెడ్డి పాల్గొని ఆలయ పునరుద్ధరణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా భక్తులతో కలిసి ఆలయ ప్రాంగణాన్ని స్వచ్ఛంగా శుభ్రపరిచి, పర్యావరణ హితంగా మట్టితో రూపొందించిన శ్రీ వినాయకుడు మరియు శివలింగాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చారిత్రక ప్రాముఖ్యతను కాపాడుతూ భావితరాలకు ఈ వారసత్వాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వసంపద రక్షక సేన సభ్యులు, కొలిమిగుండ్ల టీడీపీ అధ్యక్షుడు మూలే రామేశ్వర రెడ్డి, ప్రముఖ యూట్యూబర్ లక్ష్మీకాంత్, సెర్బియాకు చెందిన ప్రముఖ పర్యావరణవేత్త లాజర్, అలాగే పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఆలయ పునరుద్ధరణకు తమ వంతు సహకారం అందించారు. ప్రాచీన దేవాలయాల పరిరక్షణకు స్థానిక ప్రజలు, యువత స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని, ఇటువంటి కార్యక్రమాలు మన సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు ఎంతో దోహదపడతాయని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.

# బిజినెస్

## స్విగ్గీ, జొమాటోకు పోటీగా ఫుడ్‌డెలివరీలోకి ఫ్లిప్‌కార్ట్




ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ ఫుడ్‌డెలివరీ సేవల్లోకి ప్రవేశించి, స్విగ్గీ, జొమాటోలకు గట్టి పోటీనిచ్చేందుకు సిద్ధమైంది. దేశంలోనే తొలిసారిగా బెంగళూరు నగరంలో ఆగస్టు 15 కంటే ముందే ఈ సేవలను ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. రెస్టరంట్ల ఆన్‌బోర్డింగ్ ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించినట్లు సమాచారం. ప్రస్తుతం ఫుడ్ డెలివరీ సంస్థలు 16-30% కమీషన్ తీసుకుంటుండగా, ఫ్లిప్‌కార్ట్ కేవలం 10% కమీషన్‌తో రెస్టరంట్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. తొలుత బెంగళూరులో ప్రయోగాత్మకంగా పరీక్షించి, ఆపై దేశవ్యాప్తంగా విస్తరించాలని యోచిస్తోంది.

## ఎయిర్‌టెల్ 365 రోజుల రీఛార్జ్ ప్లాన్‌లు

### -మీ అవసరాలకు తగినది ఏది?

భారతీయ టెలికాం దిగ్గజం భారత్ ఎయిర్‌టెల్ తన వినియోగదారుల కోసం రూ.1,849, రూ.2,249, రూ.2,999, రూ.3,999 ధరలలో 365 రోజుల వార్షిక ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్‌లను అందుబాటులోకి తెచ్చింది. ఈ ప్లాన్‌లు అపరిమిత కాల్స్, రామీా, డేటాతో పాటు Airtel Thanks రివార్డ్స్, డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ వంటి అదనపు ప్రయోజనాలను అందిస్తాయి. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా, కాల్స్ మాత్రమే కోరుకునేవారికి, తక్కువ డేటా వాడేవారికి, స్ట్రీమింగ్ చేసేవారికి, అధిక డేటా అవసరాలున్న వారికి వేర్వేరు ప్లాన్‌లు అందుబాటులో ఉన్నాయి.

## ఆదివారం బంగారం ధరల్లో స్వల్ప మార్పులు..

భారతీయ సంస్కృతిలో పసిడిది ప్రత్యేక స్థానం. మహిళలు బంగారాన్ని కేవలం ఒక అలంకార వస్తువుగానే కాకుండా సెంటిమెంట్‌గా, కుటుంబ సౌభాగ్యానికి ప్రతీకగా, ఆపత్కాలంలో ఆదుకునే సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తారు. వివాహాలు, పండుగలు లేదా శుభకార్యాలు ఏదైనా సరే పసిడి కొంటుంటారు. అయితే గత ఏడాది కాలంగా బంగారం ధరలు అంతకంతకూ పెరుగుతూ సామాన్యులకు భారంగా మారుతున్నాయి. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాలో ఆదివారం బంగారం ధరలు స్థిరంగా ఉన్నాయి. ఆభరణాల తయారీకి ఎక్కువగా ఉపయోగించే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,32,200గా ఉంది. అలాగే 99.9శాతం స్వచ్ఛత కలిగిన 24 క్యారెట్ల 10గ్రాముల పసిడి ధర రూ.1,44,220గా ఉంది. 18 క్యారెట్ల బంగారం ధర విషయానికొస్తే.. 10 గ్రాముల ధర రూ.1,08,160 వద్ద కొనసాగుతుంది.

తెలుగు రాష్ట్రాల్లో వెండి రేట్లు

మరోవైపు వెండి ధరల విషయానికి వస్తే, హైదరాబాద్ మార్కెట్‌లో ఈరోజు వెండి ధరలు పెద్దగా మార్పు లేకుండా స్థిరంగా ఉన్నాయి.



భాగ్యనగరంలో ప్రస్తుతం 10 గ్రాముల వెండి ధర రూ.2,349 కాగా కేజీ వెండి ధర రూ.2,34,900గా ఉంది. పూజా సామాగ్రి, వెండి ఆభరణాలు, పటాలు కొనుగోలు చేసేవారికి ఈ స్థిరత్వం ఊరటనిచ్చే అంశం.

ప్రముఖ నగరాల్లో ఇలా

ఇక దేశరాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10గ్రాముల బంగారం ధర రూ.1,44,370గా ఉంది. ఇక 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,32,250గా ఉంది. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,610గా ఉండగా, 22 క్యారెట్ల తులం గోల్డ్ ధర రూ.1,32,560గా ఉంది. ఇక బెంగళూరులో 24 క్యారెట్ల 10గ్రాముల బంగా ధర రూ.1,44,220 వద్ద కొనసాగుతుండగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,32,200గా ఉంది.

## టాప్‌గేర్‌లో వాహన అమ్మకాలు.. మారుతి, హ్యుందాయ్ రికార్డు స్థాయి విక్రయాలు

**న్యూఢిల్లీ,**

వాహన అమ్మకాలు టాప్‌గేర్‌లో దూసుకుపోయాయి. కార్ల తయారీలో అగ్రగామి సంస్థలైన మారుతి సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటర్స్, మహీంద్రా అండ్ మహీంద్రా సంస్థలు రికార్డు స్థాయిలో వాహనాలను విక్రయించాయి. ప్రస్తుత నెలలో ధరలను పెంచబోతున్నట్టు ఆటోమొబైల్ దిగ్గజాలు ప్రకటించడం, జీఎస్టీ ప్రయోజనాలు లభించడం, వడ్డీరేట్లు తగ్గడం, రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు లభించడంతో వాహనాలకు ఎనలేని డిమాండ్ నెలకొన్నది. డిచిన నెలలో దేశవ్యాప్తంగా ప్యాసింజర్ వాహన విక్రయాలు 4.65 లక్షల నుంచి 4.7 లక్షలకు చేరుకున్నాయని మారుతి సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ తెలిపారు. కిందటేడాది ఇదే నెలలో 3.5 లక్షల స్థాయిలో ఉండగా, ఈ సారి 33 శాతం వరకు వృద్ధి నమోదైందన్నారు. గత నెలలో మారుతి 1,96,203 యూనిట్ల ప్యాసింజర్ వాహనాలను విక్రయించగా, హ్యుందాయ్ 54,210 యూనిట్ల విక్రయాలు జరిపింది.ఎఐఅఝఆ హ్యుందాయ్ చరిత్రలో ఒక నెలలో ఈ స్థాయిలో వాహనాలను విక్రయించడం ఇదే తొలిసారని, కొనుగోలుదారుల నుంచి పలు మాడళ్లకు డిమాండ్ నెలకొనడం వల్లనే ఇది సాధ్యమైందని హ్యుందాయ్ ఎండీ, సీఈవో తరుణ్ గార్గ్ తెలిపారు. టాటా మోటర్స్ వాహన విక్రయాల్లో 58 శాతం పెరుగుదల నమోదుకాగా, మహీంద్రా 20 శాతం, హోండా కార్స్ ఇండియా 48 శాతం, టయోటా కిర్లోస్కర్ 5 శాతం, కియా 27.4 శాతం చొప్పున వృద్ధిని సాధించాయి.

జూలై నెలలో వాహన అమ్మకాలు

| సంస్థ | 2026 | 2025 | వృద్ధి (శాతంలో) |
|---|---|---|---|
| మారుతి | 2,41,421 | 1,80,526 | 34 |
| హ్యుందాయ్ | 75,360 | 54,210 | 25.4 |
| మహీంద్రా అండ్ మహీంద్రా | 1,03,860 | 60,048 | 26 |
| మహీంద్రా ట్రాక్టర్లు | 34,420 | 28,708 | 20 |
| జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటర్ | 8,158 | --- | 22 |
| టాటా మోటర్స్ పీవీ | 63,760 | 40,175 | 59 |
| టాటా మోటర్స్ సీవీ | 39,641 | 28,956 | 37 |
| కియా ఇండియా | 28,200 | 22,135 | 27.4 |
| టయోటా కిర్లోస్కర్ | 30,516 | 29,159 | 5 |
| నిస్సాన్ మోటర్ ద్విచక్ర వాహనాలు | 9,339 | 5,608 | 66.5 |
| హోండా మోటర్‌సైకిల్ | 5,42,934 | 5,15,378 | 5 |
| హీరో మోటోకార్ప్ | 5,33,416 | 4,49,755 | 18.6 |
| సుజుకీ మోటర్‌సైకిల్ | 1,42,985 | 1,42,985 | 26 |
| రాయల్ ఎన్‌ఫీల్డ్ | 1,18,232 | 88,045 | 34 |

# స్పోర్ట్స్

## భారత్‌కు బిగ్ షాక్.. శ్రీలంక పర్యటనకు బుమ్రా దూరం..!

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27లో కీలకమైన పర్యనటకు ముందే భారత జట్టుకు బిగ్ షాక్. శ్రీలంక పర్యటనకు ఎంపికైన జస్ప్రీత్ బుమ్ర టెస్టు సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. ఫిట్‌నెస్ టెస్టులో పాసైన బుమ్రా.. మోకాలి గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడమే అందుకు కారణం. దాంతో, లంకతో రెండు టెస్టుల సిరీస్‌కు యార్కర్ కింగ్ అందుబాటులో ఉండడని ఆదివారం భారత క్రికెట్ నియంత్రణ మండలి వెల్లడించింది. శ్రీలంక పర్యటనకు స్క్వాడ్‌తో కలుస్తాడనుకున్న జస్ప్రీత్ బుమ్రా సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. రెండు రోజుల క్రితమే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌నెస్ సాధించిన అతడు.. మోకాలి గాయం నుంచి పూర్తిగా కోలుకోలేదు. కాబట్టి.. లంకతో రెండు టెస్టుల సిరీస్‌కు ఎంపికైన బుమ్రాను స్క్వాడ్ నుంచి తప్పించనుంది బీసీసీఐ. ఇంగ్లండ్ పర్యటనలో రెండో వన్డేలో గాయపడిన యార్కర్ కింగ్.. అఫ్గనిస్థాన్‌తో ఏకైక టెస్టు ఆడలేదు. సీఓఈలో ఫిట్‌నెస్‌పై దృష్టి సారించిన



అతడు.. శ్రీలంక పర్యటనకు సిద్ధంగా ఉంటాడని బీసీసీఐ ఆశించింది. కానీ, అతడు వంద శాతం కోలుకోలేదు. దాంతో.. బుమ్రా గైర్హాజరీలో భారత పేస్ దళానికి అనుభవజ్ఞుడైన సిరాజ్ నాయకత్వం వహించనున్నాడు. అయితే.. బుమ్రా స్థానంలో మరొకరిని ఇంకా స్క్వాడ్‌లోకి తీసుకోలేదు.భారత జట్టు ఆగస్టు 4వ తేదీన శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. షెడ్యూల్ ప్రకారం గాలేలో ఆగస్టు 15వ తేదీన తొలి టెస్టుకు ముందు శుభ్‌మన్ గిల్ సేన నాలుగు రోజులు ప్రాక్టీస్ మ్యాచ్ ఆడాల్సి ఉంది. అయితే.. అనుకోని కారణాల వల్ల షెడ్యూల్ మారింది. నాలుగు రోజుల వామప్ మ్యాచ్‌ను కాస్త మూడు రోజులకు కుదించారు. ఇందుకు కారణం ఏంటనేది మాత్రం తెలియాల్సి ఉంది. గాలే టెస్టు అనంతరం ఆగస్టు 23న కొలంబోలో రెండో టెస్టులో ఇరుజట్లు తలపడనున్నాయి. ప్రస్తుతం ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ర్యాంకింగ్స్‌లో 5వ స్థానంలో ఉన్న గిల్ సేన.. ఈ రెండు మ్యాచుల్లో గెలిచినా టాప్-2లోకి వచ్చే అవకాశాలు తక్కువే.

**భారత టెస్టు స్క్వాడ్ :** శుభ్‌మన్ గిల్(కెప్టెన్), కేఎల్ రాహుల్(వైస్ కెప్టెన్), యశస్వీ జైస్వాల్, రిషభ్ పంత్(వికెట్ కీపర్), సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్(వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, దేవ్‌దత్ పడిక్కల్, సరాన్ష్ జైన్.

## రహానేకు 'ఫిక్స్‌డ్ పింఛన్'.. ప్రతినెల భారీ మొత్తం చెల్లించనున్న బీసీసీఐ..!

అంతర్జాతీయ క్రికెట్ సహా ఫ్రాంచైజీ టోర్నీలకు సైతం వీడ్కోలు పలికిన అజింక్యా రహానే కు భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆర్థికంగా అండగా నిలువనుంది. మిడిలార్డర్ బ్యాటర్‌గా, వైస్ కెప్టెన్‌గా సుదీర్ఘ కాలం భారత జట్టుకు సేవలందించిన అతడికి ప్రతినెలా ఫిక్స్‌డ్ పింఛను ఇవ్వనుంది. అందరూ మాజీఆటగాళ్ల మాదిరిగానే అతడికి కూడా పెద్ద మొత్తంలో ముట్టజెప్పనుంది బీసీసీఐ. ఇకనుంచి నెలనెలా రూ.70 వేలు పింఛను రూపంలో రహానే అందుకోనున్నాడు. ఈ విషయాన్ని బీసీసీఐ ధ్రువీకరించింది.పునరాగమనం కోసం నిరీక్షించి.. సెలెక్టర్ల వైఖరితో వీడ్కోలు పలికిన అజింక్యా రహానే ఇకపై కూడా బీసీసీఐ నుంచి ఆదాయం అందుకోనున్నాడు. రిటైర్మెంట్ అనంతరం మాజీలకు ఆనవాయితీగా ఇచ్చే మంత్లీ పింఛన్ ఇప్పుడు రహానేకు దక్కనుంది. టీమిండియా తరఫున 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20లు ఆడిన ఈ వెటరన్ బీసీసీఐ ఫిక్స్‌డ్ పింఛనుకు అర్హత సాధించాడు. 80కి పైగా టెస్టులు ఆడినందున ఇకనుంచి భారత బోర్డు ప్రతి నెలా అతడికి రూ.70 వేలు చెల్లించనుంది.

**గంగూలీ హయాంలో..**

మొదట్లో రహానే అంత అనుభమున్న మాజీ



ఆటగాళ్లకు నెలకు రూ.50 వేలు మాత్రమే ఇచ్చేవారు. కానీ, నాలుగేళ్ల క్రితం సౌరవ్ గంగూలీ బీసీసీఐ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఈ మొత్తాన్ని మరో 20 వేలకు పెంచారు. దాంతో.. అప్పటి నుంచి వీడ్కోలు పలికిన భారత ఆటగాళ్లకు ప్రతినెలా ఫిక్స్‌డ్ పింఛనుగా రూ.70లు ఇస్తోంది బీసీసీఐ. 'మాజీ ఆటగాళ్లు ఆర్థికంగా మంచి స్థితిలో ఉండేలా చూసుకోవడం చాలా ముఖ్యం. భారత క్రికెట్‌కు విశేష సేవలందించిన వాళ్లకు వీడ్కోలు అనంతరం ఏ కష్టం రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత బీసీసీఐ మీద ఉంది' అని ఫిక్స్‌డ్ పింఛనును రూ.70వేలకు పెంచడంలో తన ఉద్దేశాన్ని వెల్లడించాడు గంగూలీ.క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన రహానే తన తదుపరి ప్రణాళికలు ఏంటీ? అనేది ఇంకా వెల్లడించలేదు. సుదీర్ఘ అంతర్జాతీయ అనుభవమున్న అతడు కోచ్‌గా అవతారమెత్తే అవకాశాల్ని కొట్టిపారేయలేం. వచ్చే సీజన్ ఐపీఎల్‌లో అతడిని క్రికెట్ డైరెక్టర్ లేదా.. బ్యాటింగ్ కోచ్‌గా నియమించుకునేందుకు ఫ్రాంచైజీలు ఆసక్తి చూపినా ఆశ్చర్యమేమీలేదు.

## ఆఖరి రోజు సున్నా.. 39 పతకాలకే పరిమితమైన భారత్..!




ప్రతిష్ఠాత్మక కామన్వెల్త్ క్రీడల్లో ఆఖరి రోజు భారత అథ్లెట్లు నిరాశపరిచారు. జుడోలో ఆశలు రేపిన ఇష్రూప్ నారంగ్, పారా సైక్లిస్ట్ లిషా దాస్‌లు విఫలమవ్వగా, ఒక్క పతకం రాలేదు. దాంతో, ఈసారైనా నలభైకి పైగా మెడల్స్ సాధించాలనుకున్న భారత బృందం కల నిజమవ్వలేదు. పదోరోజు బాక్సర్లు ఏడు స్వర్ణాలు, రెండు రజతాలు.. జుడోలో ఉన్నాటి శర్మ గెలిచిన కాంస్యంతోనే టోర్నీని ముగించింది టీమిండియా. 126 మంది బృందంతో వెళ్లినప్పటికీ.. చివరకు 39 పతకాలతో సగర్వంగానే స్వదేశానికి రానుంది

గ్లాస్గో ఆతిథ్యమిచ్చిన కామన్వెల్త్ గేమ్స్‌లో ఆఖరిరోజు మరిన్ని పతకాలు వస్తాయనుకుంటే నిరాశే మిగిలింది. పదోరోజు గెలిచిన మెడల్స్‌తోనే సరిపెట్టుకున్న టీమిండియా.. 39 పతకాలతో తిరిగి స్వదేశం రానుంది. బాక్సర్లు, వెయిట్‌లిఫ్టర్ల పుణ్యమాని 13 స్వర్ణాలు, 17 రజతాలు, 9 కాంస్యాలు వచ్చాయి. ఆశించిన స్థాయిలో మెడల్స్ రాకున్నా ఈసారి పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచింది భారత్. 57 కిలోల బాక్సింగ్‌లో పసిడి కొల్లగొట్టిన జాస్మినే లంబోరియా ముగింపు వేడుకల్లో భారత జాతీయ పతాకాన్ని చేబూని ముందు నడువనుంది.

భారత పతక విజేతలు

**1. స్వర్ణం :** మీరాబాయి చాను(వెయిట్‌లిఫ్టర్, 48 కిలోలు), ప్రీతి పవార్(బాక్సర్, 54 కిలోలు), జాస్మినే లంబోరియా(బాక్సర్, 57 కిలోలు), సాక్షి చౌదరి(బాక్సర్, 51 కిలోలు), ప్రియా ఘంఘాస్(బాక్సర్, మహిళల 60 కిలోలు), సచిన్ సివాగె(బాక్సర్, 60 కిలోలు) అస్మితా దే(జుడో), హర్ష్ సింగ్(జుడో), సోమన్ రానా(పారా షాట్‌పుట్), షర్మిలా ధన్కర్(పారా షాట్‌పుట్), దిలిప్ గవిట్(పారా అథ్లెటిక్స్). అరుంధతి చౌదరీ(బాక్సర్ 70 కిలోలు), అంకుశ్ పంగాల్(బాక్సర్, 80 కిలోలు)

**2. రజతం:** నీరజ్ చోప్రా(జావెలిన్ త్రో), జుడుమని సింగ్(బాక్సింగ్, 55 కిలోలు), మొహమ్మద్ బసిల్(పారా అథ్లెటిక్స్), సర్వేశ్ కుషారే(హై జంప్), గుర్వీర్ సింగ్(మారథాన్ పరుగు), ప్రవీణ్ చిత్రవేల్(ట్రిపుల్ జంప్), నరేంద్ర బెర్వాల్(బాక్సర్, 90ప్లస్ కిలోలు), లొవ్లీనా బొర్గొహైన్(బాక్సర్, 75 కిలోలు) శుభమ్ జులియా(పారా షాట్‌పుట్),

**3. కాంస్యం:** గుల్వీర్ సింగ్(అథ్లెటిక్స్), యశ్వీర్ సింగ్(జావెలిన్ త్రో), సిల్వా శ్యాల(పారా అథ్లెట్) లవ్లీనా బొర్గోహైన్( బాక్సర్, 75 కిలోలు), ఉన్నాటి శర్మ(జుడో), సెల్వ ప్రభు తిరుమరన్(ట్రిపుల్ జంప్), తేజస్విన్ శంకర్(డెకథ్లాన్)

# హోరా హోరీగా అంతర పాఠశాలల క్రికెట్ పోటీలు

**సెమిఫైనల్స్ కు చేరిన గూడూరు జడ్పీ, కొండాగుంట, ఎల్ఏపీ, ఆదిశంకర జట్లు**



పల్లె వెలుగు: ప్రతినిధి (గూడూరు, ఆగస్టు 02, ఆదివారం) : గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రోటరీ క్లబ్, అల్లూరు ఆదిశేషారెడ్డి క్రికెట్ క్లబ్, హరిచంద్రారెడ్డి, గూడూరు క్రికెట్ క్లబ్, కే. సత్య నారాయణ రెడ్డి క్రికెట్ క్లబ్ లు సంయుక్తంగా అంతర పాఠశాలల క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నాయి. అందులో భాగంగా ఆదివారం నాల్గవ రోజు క్వార్టర్ ఫైనల్స్ హోరాహోరీగా సాగాయి. ఉదయం తొలి మ్యాచ్ గూడూరు జడ్పీ, వీఎస్ఆర్ స్కూల్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన జడ్పీ హైస్కూల్ జట్టు తొలుత బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 10 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది. ఈ జట్టులోని దివేష్ 38 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన వీఎస్ఆర్ జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 71 పరుగులు చేసి అపజయం చెందింది. రెండవ మ్యాచ్ లో నారాయణ స్కూల్, కొండగుంట జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నారాయణ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేపట్టిన కొండగుంట జట్టు నిర్ణీత 10 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన నారాయణ జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 72 పరుగులు చేసింది. దీంతో కొండగుంట జట్టు 9 పరుగుల తేడాతో విజయం సాధించింది. మూడవ మ్యాచ్ లో జీవీఎస్, ఎల్ఏపీ స్కూల్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ఎల్ఏపీ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేపట్టిన జీవీఎస్ జట్టు నిర్ణీత పది ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి, 66 పరుగులు చేసింది. జట్టులోని మౌనిష్ 30 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన ఎల్ఏపీ స్కూల్ జట్టు, 7.2 ఓవర్లలోనే కేవలం ఒక్క వికెట్ కోల్పోయి 68 పరుగులు సాధించింది. 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ జట్టులోని చంద్ర 31, ప్రదీప్ 24 పరుగులు సాధించారు. నాల్గవ మ్యాచ్ లో శ్రీచైతన్య స్కూల్, ఆదిశంకర స్కూల్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ఆదిశంకర జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 94 పరుగులు చేసింది. ఈ జట్టులోని అక్షిత్ 43 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన శ్రీచైతన్య జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 10 ఓవర్లలో 72 పరుగులు మాత్రమే చేసింది. దీంతో 22 పరుగుల తేడాతో అదిశంకర జట్టు విజయం సాధించింది. దీంతో విజయం సాధించిన గూడూరు జడ్పీ, కొండాగుంట, ఎల్ఏపీ, ఆదిశంకర జట్లు

**సెమిఫైనల్స్ కు చేరుకున్నాయి.**

ఈ కార్యక్రమంలో లవ కుమార్, అంపైర్స్ గా స్టాలిన్, యూసుఫ్, సుహైల్, పవన్ సాయి, చైతన్య, మురళి, స్కోరర్ గా పూర్ణచంద్ర (నాని), పూర్నేష్ వ్యవహరించారు.

# హోరా హోరీగా అంతర పాఠశాలల క్రికెట్ పోటీలు

**-సెమిఫైనల్స్ కు చేరిన గూడూరు జడ్పీ, కొండాగుంట, ఎల్ఏపీ, ఆదిశంకర జట్లు**



పల్లె వెలుగు: ప్రతినిధి (గూడూరు, ఆగస్టు 02, ఆదివారం) : గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రోటరీ క్లబ్, అల్లూరు ఆదిశేషారెడ్డి క్రికెట్ క్లబ్, హరిచంద్రారెడ్డి, గూడూరు క్రికెట్ క్లబ్, కే. సత్య నారాయణ రెడ్డి క్రికెట్ క్లబ్ లు సంయుక్తంగా అంతర పాఠశాలల క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నాయి. అందులో భాగంగా ఆదివారం నాల్గవ రోజు క్వార్టర్ ఫైనల్స్ హోరాహోరీగా సాగాయి. ఉదయం తొలి మ్యాచ్ గూడూరు జడ్పీ, వీఎస్ఆర్ స్కూల్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన జడ్పీ హైస్కూల్ జట్టు తొలుత బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 10 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది. ఈ జట్టులోని దివేష్ 38 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన వీఎస్ఆర్ జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 71 పరుగులు చేసి అపజయం చెందింది. రెండవ మ్యాచ్ లో నారాయణ స్కూల్, కొండగుంట జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నారాయణ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేపట్టిన కొండగుంట జట్టు నిర్ణీత 10 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన నారాయణ జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 72 పరుగులు చేసింది. దీంతో కొండగుంట జట్టు 9 పరుగుల తేడాతో విజయం సాధించింది. మూడవ మ్యాచ్ లో జీవీఎస్, ఎల్ఏపీ స్కూల్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ఎల్ఏపీ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేపట్టిన జీవీఎస్ జట్టు నిర్ణీత పది ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి, 66 పరుగులు చేసింది. జట్టులోని మౌనిష్ 30 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన ఎల్ఏపీ స్కూల్ జట్టు, 7.2 ఓవర్లలోనే కేవలం ఒక్క వికెట్ కోల్పోయి 68 పరుగులు సాధించింది. 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ జట్టులోని చంద్ర 31, ప్రదీప్ 24 పరుగులు సాధించారు. నాల్గవ మ్యాచ్ లో శ్రీచైతన్య స్కూల్, ఆదిశంకర స్కూల్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ఆదిశంకర జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 94 పరుగులు చేసింది. ఈ జట్టులోని అక్షిత్ 43 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన శ్రీచైతన్య జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 10 ఓవర్లలో 72 పరుగులు మాత్రమే చేసింది. దీంతో 22 పరుగుల తేడాతో అదిశంకర జట్టు విజయం సాధించింది. దీంతో విజయం సాధించిన గూడూరు జడ్పీ, కొండాగుంట, ఎల్ఏపీ, ఆదిశంకర జట్లు సెమిఫైనల్స్ కు చేరుకున్నాయి.
ఈ కార్యక్రమంలో లవ కుమార్, అంపైర్స్ గా స్టాలిన్, యూసుఫ్, సుహైల్, పవన్ సాయి, చైతన్య, మురళి, స్కోరర్ గా పూర్ణచంద్ర (నాని), పూర్నేష్ వ్యవహరించారు.

# రెండేళ్ల నమ్మకం ప్రతి ఇంటికి అభివృద్ధి సంక్షేమం ఇంటింటి ప్రచార యాత్ర



పల్లె వెలుగు: విలేకరి (కోట, ఆగస్టు 02, ఆదివారం) : గూడూరు నియోజవర్గం శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశిం సునీల్ కుమార్ గారి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్ ప్రజల్లోకి విస్తృతంగా వెళ్తున్నారు. ఇందులో భాగంగా కోట శ్యామ సుందర పురం నాయకులతో కలిసి ఏడవ రోజు ఇంటింటికి డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా షేక్ జలీల్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను అందజేశారు. గత పాలకుల హయాంలో జరిగిన వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్న తీరును వివరించారు. గత పాలకుల నిర్లక్ష్యంతో నిలిచిపోయిన అభివృద్ధికి కూటమి ప్రభుత్వం వేగం తీసుకొచ్చింది. ప్రజల అవసరాలను తెలుసుకుని, ప్రాధాన్యతా క్రమంలో ఒక్కొక్క సమస్యకు పరిష్కారం చూపుతూ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని జలీల్ అహ్మద్ అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు డోర్ టు డోర్ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు శంషుద్దీన్, తెలుగుదేశం పార్టీ నాయకులు తల్లం శ్రీనివాసులు, నంద మోహన్, వంశి, మహిళా నాయకురాలు సుహాసిని, జిల్లా కార్యదర్శి సిద్ధప్ప రెడ్డి, పోలమ్మ, మైనార్టీ నాయకులు నౌషాద్ భాష, పోలిశెట్టి రవివర్మ , మండల సోషల్ మీడియా అధ్యక్షులు మీజురు మధు బాబు, మండల సోషల్ మీడియా ఉపాధ్యక్షులు నీలేష్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతమైన మెగా రక్తదాన శిబిరం.



రుద్రవరం.పల్లె వెలుగు: స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని అమ్మవారిశాల సెంటర్ వద్ద ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి జిల్లా పరిషత్ పాఠశాలలో 2002-2007 బ్యాచ్ పూర్వ విద్యార్థులు నంద్యాల బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'మెగా రక్తదాన శిబిరం' విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులతో పాటు మండల యువకులు, పోలీస్, రెవెన్యూ సిబ్బంది, వ్యాపారస్తులు, ఆటో డ్రైవర్లు మరియు రైతులు ఉత్సాహంగా పాల్గొని 60 మందికి పైగా రక్తదానం చేయడం విశేషం. ఈ సేవా కార్యక్రమానికి మద్దతుగా లింగం శోభన్ బాబు రక్తదాతలకు ఓఆర్ఎస్ (రా=రా) జ్యూస్ అందించగా, అమ్మవారిశాల సెంటర్‌లో బండిపై పండ్లు అమ్ముకునే ఒక పేద మహిళ "నేను సైతం" అంటూ తనవంతుగా రక్తదానం చేసిన వారికి పండ్లను ఉచితంగా అందజేసి పెద్దమనసు చాటుకున్నారు. ఆ మహిళ చూపిన ఉదారతకు ముగ్ధులైన ముఖ్య అతిథులు ఎస్ఐ జయప్ప, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ మరియు పూర్వ విద్యార్థులు ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ నంద్యాల బ్లడ్ సెంటర్, వాయిస్ ఆఫ్ రుద్రవరం, ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీం సంయుక్తంగా సర్టిఫికెట్లు అందజేయగా, 2002-2007 బ్యాచ్ కి చెందిన మాచినేని పల్లె గ్రామస్తుడు మా భాష తన పెళ్లి రోజు పురస్కరించుకొని రక్తదానం చేసిన వారికి స్టీల్ బాటిళ్లను బహుమతిగా అందించారు. భవిష్యత్ లో కూడా ఈ బ్యాచ్ ఎప్పటికీ ఇలాగే కలిసిమెలిసి మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని రుద్రవరం గ్రామస్తులు ఆకాంక్షించగా, కార్యక్రమానికి సహకరించి రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ పూర్వ విద్యార్థులు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# కాణిపాకం బ్రహ్మోత్సవాల షెడ్యూల్ ఇదే..!



పల్లె వెలుగు: ప్రతినిధి (చిత్తూరు, ఆగస్టు 02, ఆదివారం) : కాణిపాకం బ్రహ్మోత్సవాల షెడ్యూల్ ను దేవాదాయ శాఖా అధికారులు ప్రకటించారు. సెప్టెంబర్ 14న వినాయక చవితి, 15న ధ్వజారోహణం 16న నెమలి, 17న మూషిక వాహనం, 18న బంగారు చిన్నశేష వాహనం, పెద్దశేష వాహనం, 19న చిలుక, వృషభ, 20న గజవాహనం 21న రథోత్సవం 22న తిరుకల్యాణ మహోత్సవం, 23న ధ్వజావరోహణం, 24న కల్పవృక్షం, 25న రావణబ్రహ్మ వాహనం, 26న పుష్పపల్లకి సేవ, 27న సూర్యప్రభ, 28న చంద్రప్రభ వాహనం, 29న యాలి, 30న అధికార నందివాహనం అక్టోబర్ 1న పూలంగి సేవ, 2న కామధేను వాహనం, 3న విమానోత్సవం, 4న తెప్పోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగిస్తాయి.

# తిరుపతిలో ప్రశాంతంగా ముగిసిన యూపీఎస్సీ పరీక్ష




పల్లె వెలుగు: ప్రతినిధి (తిరుపతి, ఆగస్టు 02, ఆదివారం) : తిరుపతి కేంద్రంలో యూపీఎస్సీ పరీక్ష విజయవంతంగా జరిగింది. పరీక్ష కోసం మొత్తం 2186 మంది అభ్యర్థులు రిజిస్టర్ చేసుకున్నారు. ఎస్పీడబ్ల్యూ జూనియర్ కాలేజ్, పద్మావతి గర్ల్స్ హైస్కూల్ కేంద్రాల్లో జరిగిన పరీక్షకు ఉదయం 690 మంది, మధ్యాహ్నం 686 మంది హాజరు కాగా 810 మంది గైర్హాజరయ్యారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షా కేంద్రాల వద్ద అధికారులు అన్ని పటిష్ఠ ఏర్పాట్లు చేశారు

# టీచర్ వేధింపులు తట్టుకోలేక బాలిక ఆత్మహత్య



పల్లె వెలుగు: ప్రతినిధి (తిరుపతి, ఆగస్టు 02, ఆదివారం) : తిరుపతి జిల్లా నారాయణవనం మండలంలో ఓ పాఠశాల ఉపాధ్యాయుడి వేధింపులు తట్టుకోలేక బాలిక ఆత్మహత్య చేసుకున్నట్లు ఆరోపణలు వెలువడ్డాయి. ఘటనపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక విచారణలో వెల్లడికానున్నాయి.

# బళ్లారి రాఘవకు తిరుపతి ఎస్పీ నివాళి



పల్లె వెలుగు: ప్రతినిధి (తిరుపతి, ఆగస్టు 02, ఆదివారం) : ప్రముఖ నాటక రంగ మహనీయుడు బళ్లారి రాఘవ జయంతి సందర్భంగా తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాఘవ తెలుగు నాటక రంగానికి అందించిన విశిష్ట సేవలను ఆయన స్మరించుకున్నారు. మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రజలకు మరింత నిబద్ధతతో సేవలు అందించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# శ్రీవారి లడ్డూకు నేటితో 310 ఏళ్లు



పల్లె వెలుగు: ప్రతినిధి (తిరుమల, ఆగస్టు 02, ఆదివారం) : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదానికి 310 ఏళ్ల చరిత్ర పూర్తవుతున్న నేపథ్యంలో ప్రత్యేక స్మారక నాణెం (కాయిన్) విడుదల చేయాలని టీటీడీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి టీటీడీ అధికారికంగా లేఖ పంపింది. 1715 ఆగస్టులో శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు అందించడం ప్రారంభమైనట్లు చారిత్రక రికార్డులు సూచిస్తున్నాయి. ఈ విశిష్టతను ప్రత్యేక స్మారక నాణెం విడుదల చేయాలని టీటీడీ ప్రతిపాదించింది.

# రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

మహానంది, పల్లె వెలుగు రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడికి గాయాలైన ఘటన మహానంది మండలం గాజులపల్లెలో చోటుచేసుకుంది. ఆదివారం స్థానికుల వివరాల మేరకు..విభూది పెద్ద జమ్ములన్న (65) అనే వృద్ధుడు టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గాజులపల్లె -నంద్యాల రహదారిలోని ఆక్సి రిచ్ వాటర్ ప్లాంట్ సమీపాన ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతనికి గాయాలు కాగా 108 వాహనంలో ఉదయానంద ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై మహానంది పోలీసులు విచారణ చేపట్టారు

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com